

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 41.0 (గురువారం)

కనిష్ఠం : 26.0

మొక్కను నాటండి.. సంరక్షించండి



మొక్కలు నాటుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే



మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ అధికారి

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ, జూన్ 5 (ఆంధ్ర జ్యోతి) : మొక్కలను నాటడమే కాదు, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లావ్యాప్తంగా 4 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కమిషనర్ కేతన్‌గర్గ్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం ద్వారా పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ మూర్తి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్‌పై యుద్ధం నినాదంతో ఈ కార్యక్రమం రూపకల్పన చేసినట్టు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో నర్సరీలను అటవీశాఖ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫీసర్ ఎస్ఎస్ఎస్ మూర్తి, రాజమహేంద్రవరం డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఫణీంద్ర ధర్మ, రంపచోడవరం ఫారెస్ట్ రేంజ్ అధికారులు గురువారం సందర్శించారు. జైలు పర్యవేక్షణ అధికారి ఎస్ రాహుల్ జైలులోని జీవ వైవిధ్యం, నర్సరీ అభివృద్ధిని వివరించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎఫ్‌వో శ్రీనివాస్,డీఈవో కే.వాసుదేవరావు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణ ర్యాలీలో జిల్లా జడ్జి సునీత

అనాథలను చేసి.. వెళ్లిపోయారు!



నాడు కాదు.. నేడు అనాథలమయ్యాం.. మమ్మల్ని అనాథలుగా వదిలేసి ఆయన మాత్రం వెళ్లిపోయారు.. ఇక మాకు దిక్కెవరు.. అంటూ అమలాపురం శ్రీకామాక్షీ పీఠం వద్ద వందలాది మంది కన్నీటి పర్యంతమయ్యారు. కామేశ మహర్షి భౌతికకాయం వద్ద బోరున విలపించారు.. ఆయన 300 మంది అనాథలను చేరదీశారు.. వారికి విద్యాబుద్ధులు చెప్పించారు.. వారిలో చాలా మందికి వివాహాలు కూడా చేశారు..

ఆ 300 మందికి ఆయనే పెద్ద దిక్కుగా మారారు.. ఆ పెద్ద దిక్కు ఆరిపోయింది.. ఆ 300 మంది అనాథలను చేసి వెళ్లిపోవడంతో కన్నీటితో నివాళులర్పించారు.. - వార్త 6లో



కామేశ మహర్షి





నాడు 3.84 లక్షల మంది ఎంపిక..

ఉమ్మడి జిల్లాలో సొంతిళ్లు లేని 3.84 లక్షల మందిని పథకానికి ఎంపిక చేశారు. తొలివిడత కింద ఉమ్మడి జిల్లాలో 1.53 లక్షల మందిని గుర్తిం చారు.ఈ మేరకు 7,218 ఎకరాలు అవసరం కాగా 1,856 ఎకరాల ప్రభుత్వ భూమి అందు బాటులో ఉన్నట్టు గుర్తిం చారు. దీంతో 5,362 ఎకరాల ప్రైవేటు భూములను ఇళ్ల స్థలాలకు సేకరించారు.ఇందుకు ఏకంగా రూ.2,566 కోట్లు ఖర్చు చేశారు.నాడు ఒక్కో అధికార పార్టీ ఎమ్మెల్యే అప్పట్లో కోట్లలో మెక్కేశారు. ఎకరం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు ముందే కొనుగోలు చేసి అవే భూములను తమ పలు కుబడితో రూ.42 లక్షల చొప్పున ప్రభుత్వానికి అంటగట్టి జేబులు నింపేసుకున్నారు. ఇలా సేకరించిన ఇళ్లస్థలాలు అసలు ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేవని అప్పట్లో లబ్ధిదారులు పెదవి విరిచినా పట్టించుకోలేదు.ఒక్క కాకినాడ జిల్లాలోనే 359 లేఅవుట్లలో 77,896 ఇళ్లు నిర్మించి తీరాల్సిందే నని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. తూర్పు గోదావరి జిల్లాలో 321 లేఅవు ట్లలో 68 వేల ఇళ్లు కట్టించాలని భావించారు. లేఅవుట్లు ఏమాత్రం అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు అసలు కన్నెత్తి చూడలేదు.

పేదింటి కలత తీర్చేలా ప్రభుత్వం అడుగులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

పేదల ఇంటి కల నెరవేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకెళుతోంది. ఈ నెల 12వ తేదీకి జిల్లాలో చాలా మంది పేదల సొంతింటి కల నెరవేర్చి గృహ ప్రవేశాలు చేయించాలనే మంచి ఆలోచనతో అధికారులకు లక్ష్యాలను నిర్దేశించింది.సీఎం చంద్రబాబు పేదల ఇళ్ల నిర్మాణ కల సాకారం చేయడానికి పూర్తి స్థాయిలో సన్నాహాలు చేస్తున్నారు. గత ప్రభుత్వ లేఅవుట్లలో మధ్యలోనే నిలిచిపోయిన పేదల ఇళ్లకు ఆర్థిక సాయం అందించి పూర్తి చేయడం, సొంత స్థలాలు ఉన్న వారికి ఇళ్లు నిర్మించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.అందులో భాగంగా ఈనెల 12న సామూహిక ఇళ్ల ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టారు. కోనసీమ జిల్లాలో 6,300 ఇళ్లు, కాకినాడ జిల్లాలో 6వేల వరకు ప్రారంభించనున్నారు. కోనసీమలో ద్రాక్షారామలోని వెలం పాలెం లేఅవుట్, కాకినాడలోని కరప మండలం వేలంగిలో సామూహిక ఇళ్లను ప్రారంభించనున్నారు. సొంత స్థలాలు ఉన్న వారు ఇళ్లు నిర్మించుకునేలా ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తుదారుల వివరాలను కేంద్రప్రభుత్వ హౌసింగ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి అనుమతులు ఇవ్వనున్నారు.

నాడు జగన్ ఆరంభించినా..

నవరత్నాలు- పేదలందరికి ఇళ్లు పేరుతో అప్పటి జగన్ ప్రభు త్వం 2020 డిసెంబర్ 25న పథకం ప్రారం భించింది. ఉమ్మడి తూర్పుగో దావరి జిల్లా లోని పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లిలోని కొమరగిరిలో అప్పటి సీఎం జగన్ ఈ పథకాన్ని ప్రారంభించారు. కాకినాడ నగరానికి చెందిన 16 వేల మంది లబ్ధిదారులకు పిఠాపురం నియో జకవర్గం యు.కొత్తపల్లి మం డలంలోని కొమరగిరిలో 250 ఎకరాలు కొను గోలు చేశారు. ఇక్కడ సైతం ఇళ్ల నిర్మాణం పాతిక శాతం కూడా పూర్తికాలేదు.పైగా ఇక్కడ అప్పటి సీఎం జగన్ పథకాన్ని ప్రారంభించగా, పూర్తిగా విఫలమైంది. ఇలా ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లాలో అనేక లేఅవుట్లు ఇళ్ల నిర్మాణం జరగక దిష్టిబొమ్మల్లా మారాయి.

ఖాళీ స్థలాలపై సీఎం దృష్టి..

ప్రభుత్వం మారడంతో వీటిపై సీఎం చంద్రబాబు దృష్టిసారించారు. వేల కోట్లు వెచ్చించిన లే అవుట్ల పరిస్థితిపై కలెక్టర్ల ద్వారా నివేదిక సిద్ధం చేయిస్తున్నారు.ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని లే అవుట్లలో 1.70 లక్షల స్థలాలు ఖాళీగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో 1.06 లక్షల స్థలాలు పూర్తిగా ఖాళీగా ఉన్నాయని తేల్చారు. ఇందులో కొమరగిరి, కరప, రౌతులపూడి, తుని, కోటనందూరు, ఏలేశ్వరం,తాళ్లరేవు తదితర మండలాల్లో లేఅవుట్లు ఉన్నట్టు గుర్తించారు. కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో 64 వేల వరకు స్థలాలు ఖాళీగా ఉన్నట్టు గుర్తించారు. ఇందులో అసలే మాత్రం పనికిరానివి ఎన్ని? శ్మశానాల పక్కన ఉన్నవి ఎన్ని అనేది సైతం త్వరలో తేల్చబోతున్నారు.దీని ఆధారంగా పట్టాలు రద్దు చేస్తారు.

'తూర్పు'న లెక్క ఇలా..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలో 10,794 పేదల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా యం త్రాంగం పని చేస్తోంది.ఈ మేరకు కలెక్టర్ పి.ప్రశాంతి టార్గెట్ నిర్ణయించి ఆయా లేఅవుట్ల వారీ ప్రత్యేకాధికారులను నియమించి పనులు పరుగులు పెట్టిస్తున్నారు.ఇప్పటి వరకూ 5957 ఇళ్లు పూర్తయ్యాయి.ఇంకా 4837 ఇళ్ల నిర్మాణం పెండింగ్‌లో ఉంది.ఈ నెల 7వ తేదీకి మరో 2419 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు.ఇప్పటికి అందులో 62 పూర్తి చేశారు. ఇంకా జిల్లాలో 310 ఆర్‌సీ లెవల్, 1144 రూఫ్ లెవల్‌లో ఉన్నాయి.వాటిని ముందుగా పూర్తి చేసే ఆలోచన ఉంది. బేస్‌మెంట్ లెవల్‌లో 5714, లింటల్ లెవల్‌లో 2193 ఉన్నాయి.అవిప్పుడే పూర్తయ్యే అవకాశం లేదు. ఇళ్ల నిర్మాణ లక్ష్యాలతో ముందుకు వెళ్లే అధి కారులకు కొన్ని ఇబ్బందులతో ఒత్తిడికి గురవుతున్నారు.

- 12న సామూహిక ఇళ్ల నిర్మాణాలు?
- ప్రారంభానికి అధికారుల సన్నాహాలు
- కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- గత ప్రభుత్వ నిర్వాకంపై నివేదిక
- 1.70 లక్షల ఇళ్ల స్థలాలు ఖాళీ
- ఉమ్మడి జిల్లాలోనే ఇదీ లెక్క
- రద్దు చేసే యోచనలో సర్కారు?

తూర్పున మండలాల వారీ ఇలా..

రాజమండ్రి అర్బన్‌కు చెందిన 3096 ఇళ్లను వెలుగుబందలో నిర్మించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 2327 పూర్తయ్యాయి. ఇది 75 శాతం.769 పెండింగ్‌లో ఉన్నాయి. అనపర్తిలో 685 లక్ష్యం కాగా 156 పూర్తయ్యాయి. ఇది 23 శాతం. బిక్కవోలులో 695 లక్ష్యంకాగా 197 పూర్తయ్యాయి.28 శాతం. కొవ్వూరులో 460కి 149 పూర్తి.ఇది 32 శాతం. సీతానగరంలో 269కి 88 పూర్తి ఇది 33శాతం. చాగల్లులో 385కి 132 పూర్తి ఇది 34 శాతం. కొవ్వూరు అర్బన్‌లో 595కి 209 పూర్తి ఇది 35శాతం . రాజమండ్రి రూరల్‌లో 295కి 105 పూర్తి ఇది 36 శాతం. ఉండ్రాజవరంలో 306కి 121 పూర్తి ఇది 40 శాతం. రంగంపేటలో 304కి 123 పూర్తి ఇది 40శాతం. నిడదవోలు అర్బన్‌లో 223కి108 పూర్తి. ఇది 48 శాతం. కడియంలో 219కి 108 పూర్తి ఇది 49శాతం. తాళ్లపూడిలో 284కి 151 పూర్తి ఇది 53 శాతం. పెరవలిలో 138కి 80 పూర్తి ఇది 58 శాతం. రాజానగరంలో 289కి 178 పూర్తి ఇది 62శాతం. కోరుకొండలో 266కి 165 పూర్తి ఇది 62శాతం. గోకవరంలో 211కి 131 పూర్తి ఇది 62 శాతం. నిడదవోలులో 388కి 212 పూర్తి ఇది 63శాతం. దేవరపల్లిలో 699కి 476 పూర్తి ఇది 68 శాతం. నల్లజర్లలో 563కి 399 పూర్తి ఇది 71 శాతం. గోపాలపురంలో 474కి 342 పూర్తి. ఇవి 72శాతం.

నేటి నుంచి మెగా డీఎస్సీ పరీక్షలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షలు జూన్ 6 నుంచి 30వ తేదీ వరకు మూడు సెషన్లలో జరుగుతాయని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. మెగా డీఎస్సీ పరీక్షల నిర్వహణపై గురువారం సాయంత్రం సమీక్షించారు. మెగా డీఎస్సీ పరీక్షలకు జిల్లాలో 3977 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. రాజమహేంద్రవరం లూథర్‌గిరిలోని అయాన్ డిజిటల్ కళాశాలలో ఈ నెల 6న 600 మందికి, 9న 600 మందికి, 12న 596 మందికి, 13న 960 మందికి, 23న 960 మందికి, 24న 301 మంది అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు.పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం విద్యుత్ ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఆటంకం లేకుండా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇబ్బంది లేకుండాచూడాలన్నారు.సమావేశంలో డీఈవో కే వాసుదేవరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కే తిలక్‌కుమార్, ఆర్‌టీసీ,డీఎం షబ్నం ఇతర సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగా చేస్తే ఆరోగ్యం : జేసీ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ ఉదయం యోగా చేస్తే ఆరోగ్యమని జేసీ ఎస్ చిన్నరాముడు అన్నారు. యోగా సాధన మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఆర్ట్స్ కళాశాల సమీపంలోని గ్రాండ్ ట్రంక్ రోడ్డులో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ప్రతి ఉదయం యోగాసాధన వల్ల శరీర రుగ్మతలు తొలగి ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు.ప్రజలందరూ స్వచ్ఛందంగా కుటుంబ సమేతంగా యోగ సాధన లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.విశాఖపట్నంలో ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో మన జిల్లా నుంచి శిక్షణ పొందిన ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, యోగాంధ్ర జిల్లా సమన్వయకర్త పి . కాజియా, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కెసి హెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కడియపులంకలో యోగాంధ్ర

కడియం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కడియం నర్సరీలో పర్యాటక యోగాంధ్ర శనివారం జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో గురువారం పర్యాటక, ఇతర సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అఖండ గోదావరి ప్రాజెక్టు ఏర్పాటు చేసే క్రమంలో నిర్వహణ సామర్థ్యంపై సమాంతరంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లాలో నాలుగు పర్యాటక ప్రాంతాల్లో యోగాంధ్ర నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా శనివారం కడియపులంక పుల్లా చంటియ్య - సత్యదేవానర్సరీలో చేపడుతున్నట్టు తెలిపారు.సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, ఏపీఎంఐపీ పీడీ ఏ.దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

సీఎం చంద్రబాబు ఈ నెల 10,12 తేదీల్లో రాజమహేంద్రవరంలో పర్యటించనున్నారు.. ఈ మేరకు ఏర్పాట్లను కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహకిశోర్ పరిశీలించారు. - 7లో





- యథేచ్ఛగా డీజిల్ అక్రమ రవాణా
- బయోడీజిల్ పేరుతో బంక్ ఏర్పాటు
- యానాం తదితర ప్రాంతాల నుంచి దిగుమతి
- ప్రత్యేకంగా హెచ్‌పీ స్టిక్టర్ ఒక ట్యాంకర్
- బయట లీటర్ రూ.96.. ఇక్కడ రూ.75
- పురుషోత్తపల్లి కేంద్రంగా సాగుతున్న దందా

ఇప్పటి వరకూ ఇసుక మాఫియా చూశాం.. మట్టి మాఫియా.. డీజిల్ మాఫియా ఎక్కడైనా చూశారా.. చూడలేదంటారా.. అయితే ఇప్పుడు చూసేయవచ్చు. ఒకసారి నిడదవోలు మండలం పురుషోత్తపల్లి వెళితే అక్కడ ఏకంగా ఒక బంక్‌నే ఏర్పాటు చేసేశారు.. యథేచ్ఛగా బయోడీజిల్ పేరుతో డీజిల్ విక్రయిస్తూ దందాకు తెరలేపారు.. అది కూడా హెచ్‌పీ స్టిక్కర్‌తో ఉన్న ట్యాంకర్‌ను ఒక బొలెరో వాహనాన్ని ఏర్పాటు చేసుకుని ఎక్కడికి కావాలంటే అక్కడికి డీజిల్ తరలిస్తూ దందా సాగిస్తున్నారు. సాధారణంగా ఏ బంక్‌లో చూసిన లీటర్ డీజిల్ రూ. 96ల వరకూ ఉంది. . ఈ బంక్ నుంచి డోర్ డెలివరీ చేసినా రూ.75లు మాత్రమే. అలా ఎలా అంటారా.. ఒకసారి దందా ఎలా సాగిస్తున్నారో మీరే తెలుసుకోండి మరి..

నిడదవోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆ దారిలో వెళ్లే వాహనాలు చాలా తక్కువ.. అయితే ఆ దారిలో మాత్రం ఒక బంక్ ఉంటుంది.. చూసిన వారెవరికైనా ఇక్కడ బంక్ ఎందుకు అనే అనుమానం రాక మానదు.. ఎందుకంటే డీజిల్ బంక్ అనే బోర్డు తప్ప ఇంకేం ఉండదు. దీనిపై అనుమానం వచ్చిన 'ఆంధ్రజ్యోతి' ఆరా తీస్తే అసలు దందా బయటపడింది. మట్టి, ఇసుకను మించి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతూ డీజిల్ మాఫియా చెలరేగిపోతుందనే విషయం బయటపడింది. పేరుకు మాత్రమే బయో డీజిల్ బంక్ ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుంచి డీజిల్‌తో పాటుగా బయోడీజిల్ పేరుతో క్రూడాయిల్‌ను దిగుమతి చేసుకుని డీజిల్ మాఫియాకు తెరలేపుతున్నారు. ప్రముఖ కార్పొరేట్ కంపెనీ హెచ్.పీ పేరుతో ఏకంగా ట్యాంకర్ ఉన్న వాహనాన్ని తయారు చేయించి అడిగిన చోటుకు నేరుగా వచ్చి అన్‌లోడ్ చేసి వెళ్లిపోతున్నారు.పగలు రాత్రి తేడా లేకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టి డీజిల్ దందా నడుపుతున్నా ప్రభుత్వ అధికారుల మౌనంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బయోడీజిల్ పేరు ఎక్కడ?

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం గోపవరం నుంచి డి.ముప్పవరం వెళ్లే దారిలో పురుషోత్తపల్లి సమీపంలో బయో డీజిల్ బంక్ ఏర్పాటైంది.మాఫియా ఈ బంక్‌ను అడ్డాగా చేసుకుని డీజిల్ బంక్ అంటూ బోర్డు పెట్టేసింది. తెలంగాణ, మహారాష్ట్ర నుంచి పరిశ్రమల క్రూడాయిల్‌ను తెప్పిస్తూ దీంతో పాటుగా అప్పుడప్పుడు బయోడీజిల్ దిగుమతి చేసుకుంటున్నారు.ఆ తరువాత లారీ యజమానులను బయోడీజిల్ అంటూ బురిడీ కొట్టిస్తున్నారు.కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి దొడ్డి దారిన బిల్లులు లేకుండా తక్కువ ధరకు డీజిల్ తెప్పిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.ఈ డీజిల్‌ను ఇసుక ర్యాంపుల వద్ద ఇసుక లారీలకు ప్రత్యేకంగా హెచ్‌పీ స్టిక్కర్‌తో తయారు చేయించిన వాహనం ద్వారా అనధికారికంగా సరఫరా చేస్తున్నారు.

డీజిల్ లీటర్ రూ.75

ఈ డీజిల్ దందా కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి వచ్చే అనధికార డీజిల్‌తో పాటుగా బయో డీజిల్ అంటూ ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న రెండో రకం క్రూడాయిల్‌ను యథేచ్ఛగా విక్రయించేస్తున్నారు. దీనిపై కూపీ లాగగా ఆ బంక్ పేరుతో ఒక ట్యాంకర్ బయో డీజిల్ బిల్లుతో వస్తే మరో ఆరు ట్యాంకర్ల క్రూడాయిల్ అనధికారికంగా వస్తుందని అలాగే యానాం నుంచి డీజిల్ ఎటువంటి బిల్లులు లేకుండా లారీలకు లారీలు దొడ్డిదారిన ఇక్కడకు వస్తున్న విషయం బట్టబయలైంది. పురుషోత్తపల్లి బంకు నుంచి యథేచ్ఛగా డీజిల్ దందా సాగుతున్నా అధికారుల మౌనం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.పెట్రోల్ బంకుల్లో సుమారు రూ.96లకు లీటర్ డీజిల్ ధర ఉండగా అడిగిన చోటుకే వచ్చి సుమారు రూ.75లకే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే డీజిల్, బయోడీజిల్, డీజిల్ పేరుతో క్రూడ్ ఆయిల్ సరఫరా చేస్తున్నారు.ఇసుక లారీ యజమానులు ఇవి తక్కువ ధరకు రావడం తమకు కావలసిన చోటుకు వచ్చి అందించడంతో ఈ డీజిల్ మాఫియాకు పూర్తిగా సహకరిస్తున్నారు.ఈ డీజిల్ మాఫియాపై అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందనలేదని ప్రముఖ కార్పొరేట్ కం పెనీ డీజిల్ డీలర్ ఆవేదన వ్యక్తం చేశారు.

హెచ్.పి.కంపెనీ పేరుతో వాహనం



డీజిల్ మాఫియాకు సుమారు 3 వేల లీటర్లు కలిగిన ట్యాంకర్‌తో బొలేరో వాహనాన్ని సి ద్ధం చేశారు.ఆ ట్యాంకర్ వెనుక భాగంలో డీజిల్ కొట్టేందుకు గన్, డిజిటల్ ఎక్విప్‌మెంటు ఏర్పాటు చేసింది. దీనిపై ఎవరికి అనుమానం రాకుండా.. అనుమతులు లేకుండానే హెచ్‌పి (హిందుస్థాన్ పెట్రోలియం) కంపెనీ లోగోను పెయింట్ వేయించేసింది.ఈ వాహనం ముందు నుంచి చూస్తే బొలేరో వాహనంలా కనిపి స్తుం ది. వెనుక చూసే వారికి మాత్రమే ట్యాం కర్ లా కనిపిస్తుంది. ఈ వాహనానికి ఎటువంటి అనుమతులు లేకుండానే లారీ స్టాండులో ఉన్న లారీలకు, జిల్లాలోని ఇసుక ర్యాంపుల్లో ఉండే లారీలకు నేరుగా పోయి డీజిల్ సరఫరా చేస్తు న్నారు. చూసేవారికి హెచ్.పి కంపెనీకి చెందిన ఆయిల్ ట్యాంకర్‌లా నమ్మిస్తూ ఇలా అనధికారి కంగా యథేచ్ఛగా డీజిల్ దందా సాగిస్తోంది.

ఆటలోనే..ఊపిరి ఆగింది!



అప్పటి వరకూ ఎంతో సరదాగా ఆడుకుంది.. పైన చెట్టుపై పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించలేక పోయింది.. ఆడుకుంటుండగా ఒక్కసారిగా విరిగిపడిన చెట్టు కొమ్మకింద అమ్మా అంటూ ఒక్కసారిగా కూలబడిపోయింది ఆ చిన్నారి తల్లి.. 7

అనాథలను చేసి..
వెళ్లిపోయారు!


కామేశమహర్షి

- అమలాపురం శ్రీకామాక్షీ పీఠం పీఠాధిపతి కామేశమహర్షి హఠాన్మరణం
- 300మందికిపైగా అనాథలకు ఆశ్రయం కల్పించిన మహోన్నత వ్యక్తి
- అక్కున చేర్చుకుని ఆదరించడమే కాక వివాహాలు సైతం చేసిన మహర్షి
- ప్రేమతత్వం.. ఆధ్యాత్మికత.. సేవా గుణం కలగలిసిన మనీషి..
- నేడు కామాక్షీ పీఠంలో మహర్షి సిద్ధిసమాధి

అమలాపురం టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఒకరా ఇద్దరా.. వందలాదిమంది అనాథలను అక్కున చేర్చుకుని ఆదరించిన మంచి మనసున్న వ్యక్తి ఆయన.. అనాథలకు ఆశ్రయం కల్పించడంతోపాటు వివాహాది కార్యక్రమాలు సైతం నిర్వహించిన నిండైన హృదయం కలిగిన గొప్ప వ్యక్తి ఆయన.. ఎందరినో సొంతింటి వాళ్లను చేసిన ఘనత ఆయనది.. ఆయనే అమలాపురం శ్రీకామాక్షీ పీఠం పీఠాధిపతి కామేశమహర్షి. ఆయన అనారోగ్య కారణాలతో గురువారం తెల్లవారుజామున అకస్మాత్తుగా అమలాపురంలో పరమపదించారు. ఈ సందర్భంగా ఆయనపై ప్రత్యేక కథనం..

కామాక్షీదేవి అనుగ్రహంతో..

కామాక్షీదేవి అనుగ్రహంతో కంచి పరమాచార్య శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి ఆశీర్వాదంతో కామేశమహర్షి అమలాపురంలో శ్రీకామాక్షీ పీఠాన్ని స్థాపించారు. పీఠాధిపతిగా అమ్మవారి సేవకు మాత్రమే పరిమితం కాకుండా మానవసేవే మాధవసేవగా ఎంచుకున్న ఆయన ప్రేమతత్వాన్ని ప్రబోధిస్తూ ముందుకు సాగారు. ఆయన సేవలకు గుర్తింపుగా మద్రాసు తెలుగు అకాడమీ ఉగాది పురస్కారంతోపాటు రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ఎన్నో సంస్థలు, క్లబ్‌లు అవార్డులు, రివార్డులతో ఆయన్ను సత్కరించి సేవలను కొనియాడారు. అటువంటి ఆదర్శ మహనీయుడు కామేశమహర్షి(88) గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు బ్రహ్మీభూతత్వసిద్ధిని పొందారు. అహర్నిశలు తమకోసం శ్రమించిన కామేశ మహర్షి కన్నుమూయడంతో ప్రేమమందిరం చిన్నారులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.ఆదర్శనీయుడైన ఆమహనీయుని జీవితంలోని పలు ఘట్టాలు ఇలా ఉన్నాయి.

ఒక్కగానొక్క కొడుకు..

అమలాపురం పట్టణానికి చెందిన బెహరా సుబ్రహ్మణ్యం-వెంకటరత్నమాంబ దంపతులకు 1938, ఏప్రిల్ 2న యర్రంరాజు జన్మించారు. ఒక్కగానొక్క కుమారుడు కావడంతో ఎంతో అల్లారు ముద్దుగా యర్రంరాజును పెంచారు. సుబ్రహ్మణ్యం ఉద్యోగ రీత్యా పలు ప్రాంతాల్లో పనిచేయడంవల్ల చిన్నతనంలోనే పలు ప్రాంతాల్లో తిరిగారు. అనంతరం అమలాపురంలో డాక్టర్ జొన్నలగడ్డ మల్లపరాజువద్ద ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యనభ్యసించిన యర్రంరాజు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాలలో బీఎస్సీ చదివారు. మద్రాసు కాలేజ్ ఆఫ్ఇంజనీరింగ్ టెక్నాలజీలో ఏఎంఐఈ ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేశారు. అలా ఉన్నత చదువులు పూర్తి చేశారు.

కంచి పరమాచార్య స్ఫూర్తితో..

ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసిన యర్రంరాజు కంచి పరమాచార్యశ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామిని స్ఫూర్తిగా తీసుకున్నారు. కామేశమహర్షిగా మారి చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి ఆశీర్వాదంతో కామాక్షీదేవి అనుగ్రహంతో 1967లో అమలాపురం కూచిమంచి అగ్రహారం రోడ్డులో కామాక్షీ పీఠాన్ని ఏర్పాటు చేశారు. శ్రీకామాక్షీదేవి అనుగ్రహంతో ఎన్నో ధర్మప్రచార ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాలను నిర్వహించారు. కామాక్షీ పీఠానికి తల్లిదండ్రులు తమ ఆస్తిని అందిస్తే దాతలు ముందుకు రావడంతో ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దారు. రోళ్లపాలెంలో అమలేశ్వరస్వామిఆలయాన్ని నిర్మించారు. అక్కడకు సమీపంలోని చిందాడమడుగును వెలుగులోకి తీసుకువచ్చి గోదావరి పుష్కరాలకు అంతర్వాహినిగా తీర్చిదిద్దారు. తుని మండలం హంసవరంలో శ్రీకామాక్షీదేవి, ఆదిశంకరుల ఆలయాలను కామేశమహర్షి నిర్మించారు.

కంచితో అనుబంధం..

కామేశమహర్షికి కంచి పీఠంతో ఎనలేని అనుబంధం ఉంది. 1967లో చంద్రశేఖరేంద్రసరస్వతీస్వామిజీ అమలాపురం వచ్చినప్పుడు ఆయన్ను ప్రత్యేకంగా కలిశారు. 1972, 1996 తుపాను సమయంలోను అమలాపురం శ్రీకామాక్షీ పీఠాన్ని జయేంద్రసరస్వతీమహాస్వామి సందర్శించారు. పేరూరులో విజయయాత్రకు వచ్చిన శ్రీవిజయేంద్రసరస్వతి స్వామిజీపీఠాన్ని సందర్శించారు. ఎన్నోసార్లు కంచి కామాక్షీ పీఠాన్ని కామేశమహర్షి సందర్శించారు.

చిన్నారులకు అన్నీ ఆయనే..

ప్రేమ మందిరంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు తల్లీతండ్రి ఆయనే. గురువు, బంధువు, స్నేహితులు ఆయనే. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న చిన్నారుల ఇంటిపేరే ప్రేమమందిరం. అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాల్లోని ఇంజనీరింగ్, డిగ్రీ, ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు ముందుకు రావడంతో ఉచితంగానే ఇంజనీరింగ్, డిగ్రీ, ఇంటర్మీడియట్ కోర్సులు పూర్తి చేస్తున్నారు. మరికొందరు స్వల్ప ఫీజులతో చదువుకుంటుంటే మరికొందరు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు దశాబ్దాల వ్యవధిలో ప్రేమమందిరంలో ఆశ్రయం పొందిన 60మంది యువతులు, 20మంది యువకులకు అన్నీ తానై వివాహాలు జరిపించిన ఘనత కామేశమహర్షిదే. వారిలో ఎందరో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతూ జీవితంలో స్థిరపడ్డవారే. ప్రకృతి విపత్తుల సమయాల్లో శ్రీకామాక్షీ పీఠం తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. అన్నదానం, వస్త్రదానం కూడా చేశారు.

2019లో సహస్ర పూర్ణచంద్ర దర్శనం

కామేశ మహర్షికి 2019, మే 5న సహస్ర పూర్ణ చంద్రదర్శన మహోత్సవాలు వారంరోజులపాటు నిర్వహించారు. శ్రీకామాక్షీదేవి అనుగ్రహంతో కామేశమహర్షి రచించిన అనేక పుస్తకాలను విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి బులుసు శివశంకరరావు ఆవిష్కరించారు.

నేడు కామాక్షీపీఠంలో దివ్యసమాధి

కామేశమహర్షి బ్రహ్మీభూతత్వ సిద్ధిని పొందడంతో భక్తుల దర్శనార్థం కామాక్షీ పీఠంలో ఉంచారు. శుక్రవారం ఉదయం 6.30గంటలకు కామేశమహర్షి దివ్యసమాధి కార్యక్రమం నిర్వహించేందుకు పీఠం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. 8న ఆదివారం బ్రహ్మీభూత దివ్య ఆరాధన మహోత్సవంతోపాటు అష్టోత్తర శతవార విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించేందుకు శిష్య బృందం ఏర్పాట్లు చేసింది.

కామాక్షీ ప్రేమమందిరం ఏర్పాటు ఇలా..

1986లో గోదావరి వరదల కారణంగా అమలాపురం మార్కెట్ ఏరియాలో ముంచెత్తిన వరదలతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అనాథలుగా మారారు. దీంతో చలించిన కామేశ మహర్షి కృష్ణ, సత్యవతి, నాగమహేశ్వరి అనే బిడ్డలను తీసుకుని కామాక్షీ పీఠానికి చేరుకున్నారు. అప్పుడు గోదావరి వరదల పర్యవేక్షణకు ప్రత్యేకంగా నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారి టి.గోపాలరావుతో కామాక్షీ ప్రేమమందిరాన్ని ప్రారంభింపజేశారు. ముగ్గురితో ప్రారంభమైన ప్రేమమందిరం ఇప్పటివరకు 300మందికిపైగా బిడ్డలకు ఆశ్రయం కల్పించింది. తల్లి పొత్తిళ్లలో కళ్లు తెరవని ఆడబిడ్డలు సైతం కామాక్షీ ప్రేమ మందిరంలోనే కళ్లు తెరిచారు. అమ్మానాన్నలను కోల్పోయి అయినవాళ్లకు దూరంగా.. అనాథలుగా మారినవారు కొందరైతే, ప్రకృతి వైపరీత్యాలు, కుటుంబ తగాథాలతో ఒంటరిగా మిగిలిన అనాథలకు ఆయన ఆశ్రయం కల్పించారు. ప్రస్తుతం ప్రేమ మందిరంలో 55మంది పిల్లలతోపాటు ఐదుగురు పెద్దలు ఉంటున్నారు.


కామేశమహర్షి సహస్రపూర్ణచంద్రోయ దర్శన మహోత్సవంలో పాదపూజ(ఫైల్)

కొంగలే.. ఎగిరెలే..!




ఓ పక్క వేసవితో జనం అల్లాడిపోతున్నారు. అలాంటిది పక్షుల పరిస్థితి ఏంటి..? కాకినాడ వలసపాకల బీచ్ రోడ్డుపక్కన ఆకలి, దాహం తీర్చుకునేందుకు వచ్చిన కొంగలు కాసేపు ఇసుక తిన్నెలపై ఎండిచేపలు తిన్నాయి.. కాసేపటికి అన్నీ కలిసి గుంపుగా.. ఒకేసారి ఎగురుతూ.. ఇలా కనిపించాయి.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

మొక్కలు నాటి..
పెళ్లి పీటలు ఎక్కారు

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున ఆదర్శంగా నిలిచిన నూతన జంట


అల్లూరిజిల్లా కూన వరం మండలం పైడిగూడెంలో పెళ్లి వస్త్రాలతోనే మొక్కలు నాటుతున్న నవీన్, రమ్య

కూనవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో తామూ భాగస్వాములవుతామంది ఓ నూతన జంట. అల్లూరిజిల్లా కూనవరం మండలం పైడిగూడెం గ్రామానికి చెందిన నవీన్, రమ్య వివాహానికి పెద్దలు గురువారం ముహూర్తం నిర్ణయించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం కావడంతో ముందుగా వారు అటవీ అధికారుల సమక్షంలో పెళ్లి వస్త్రాలతోనే మొక్కలు నాటి ఆ తర్వాత వివాహం చేసుకుని ఆదర్శంగా నిలిచారు. డీఎఫ్‌వో బబిత, సబ్ డీఎఫ్‌వో రాఘవరావు, కూనవరం అటవీ శాఖ అధికారి కరుణాకర్ పాల్గొన్నారు.

బాలబాలాజీస్వామి పెండ్లికొడుకాయెనే

- ఘనంగా ప్రారంభమైన అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాలు

మామిడికుదురు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వైనతేయ నదీతీరంలోని అప్పనపల్లి బాలబాలాజీస్వామివారు కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం పెండ్లి కొడుకయ్యారు. జ్యేష్ఠ శుద్ధ దశమి పర్వదినాన వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, గోవిందనామస్మరణలు, సుగంధ ద్రవ్యాల పరిమళాల మధ్య శ్రీబాలబాలాజీస్వామివారి తిరు కల్యాణ మహోత్సవాలకు గురువారం అంకురార్పణ జరిగింది. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని బాలబాలాజీస్వామితోపాటు శ్రీదేవిభూదేవిలను వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి వారి బుగ్గన చుక్కపెట్టి నుదుటిన కల్యాణం దిద్ది పెండ్లి కొడుకు, పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేశారు. కల్యాణోత్సవాలకు ఏవిధమైన ఆటంకాలు తలెత్తకుండా విశ్వక్సేనారాధన కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు, భక్తులు 108 కలశలతో పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పసుపు కుంకుమలతో స్నపన తిరుమంజన సేవను కన్నుల పండువగా నిర్వహించారు. పుట్ట నుంచి సేకరించిన పుట్టమన్నును తొమ్మిది పాత్రల్లో నింపి అంకురార్పణ కార్యక్రమాన్ని జరిపించి పుణ్యావహచనం, పంచగవ్యప్రాశనం, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణోత్సవాలు పంచారాత్ర ఆగమానుసారం ఆలయ ఉపముఖ్య అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, త్రిదండ శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి, వారి శిష్యులు, చలమచర్ల వేణుగోపాలాచార్యుల బృందం ఆధ్వర్యంలో ఐదురోజులపాటు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు ఘనంగా చేశారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. స్వామివారి కల్యాణం శుక్రవారం రాత్రి 9.15 గంటలకు జరుగుతుందని, భక్తులు పాల్గొని కల్యాణాన్ని కనులారా వీక్షించి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సహాయ కమిషనర్ సత్యనారాయణరాజు కోరారు.


బాలబాలాజీస్వామిని పెండ్లికుమారుడిని చేస్తున్న అర్చకులు


కలశల్లో ఏర్పాటు చేసిన అంకురాలు.. చిత్రంలో కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు

సత్యదేవుడి సన్నిధిలో సేవ చేయాలనుకుంటున్నారా?

- దేవస్థానం పీఆర్వో విభాగంలో భక్తులు నమోదు చేసుకునే అవకాశం

అన్నవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో భక్తులకు మంచినీటి సరఫరా, అన్నప్రసాదం వడ్డన, క్యూలైన్‌ల్లో భక్తులను ముందుకు కదపడానికి తదితర సేవలు చేయడానికి ఆసక్తి కలిగినవారు దేవస్థానం పీఆర్వో విభాగంలో వారి పేర్లు, ఇతర వివరాలు నమోదు చేసుకోవాలని అన్నవరం దేవస్థాయం ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల సేవకు విచ్చేసిన తెలంగాణ భక్తులు మధ్యవర్తుల ద్వారా రావడం.. అనంతరం వారిని దేవస్థానంలో ఒక అధికారి దురుసుగా మాట్లాడడంతో వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు సేవ చేయాలనుకునే భక్తులు తునికి చెందిన శ్రీవారిసేవ అనే సంస్థ ద్వారా విచ్చేసేవారు. ఇకపై ఆసక్తి ఉన్నవారు నేరుగా పీఆర్వో కార్యాలయం ద్వారా సేవ చేసుకునే వీలు కల్పించారు.

ఎన్‌బీఏతో సాంకేతిక విద్యలో నాణ్యతా ప్రమాణాలకు ప్రోత్సాహం

- జేఎన్టీయూకే ఉపకులపతి ప్రసాద్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే,జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఎన్‌బీఏ గుర్తింపు ద్వారా సాంకేతిక విద్యలో నాణ్యతా ప్రమాణాలను ప్రోత్సహించేందుకు మరింత వీలు కలుగుతుందని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ ఆర్కే ప్రసాద్ తెలిపారు. వర్సిటీలో నియూసీఈకే కళాశాలకు యూజీ ప్రోగ్రామ్స్‌కు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించిన సందర్భంగా ప్రిన్సిపాల్ మోహన్‌రావు అధ్యక్షతన అలూమ్ని ఆడిటోరియంలో గురువారం ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులకు, బోధన, బోధనేతర సిబ్బందికి అభినందనసభను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ ప్రసాద్ మాట్లాడుతూ సివిల్, ఈఈఈ, ఈసీఈ, సీఎస్ఈ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలను ఎన్‌బీఏ బృందం గతనెలలో సందర్శించిందన్నారు. ఈ ఐదువిభాగాలకు 2025-26, 2026-27, 2027-28 విద్యాసంవత్సరాలకుగాను ఎన్‌బీఏగుర్తింపు లభించిందని,2028, జూన్ 30వరకూ ఈ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపు కొనసాగుతుందని తెలిపారు. వైస్‌ప్రిన్సిపాల్స్ జీవీఎస్ఆర్ దీక్షితులు, స్వరూపారాణి విభాగాధిపతులు కోటేశ్వరరావు, వెంకటరెడ్డి, మధు, సురేఖ, కళ్యాణమనోహర్, సత్యవేణి, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, మాజీ వీసీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ముంగండ విద్యార్థుల ఎంపిక

పి.గన్నవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ముంగండ గ్రామానికి చెందిన పదిమంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 4న ఉమ్మడి జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం మండలంలోని ముంగండ గ్రామానికి చెందిన వి.రిషిత, ఎంపీఎస్ లక్ష్మి, పి.వర్షిణి, వి.ప్రణీత్, ఎం.జగదీష్, వీఎంవీ గోపాల్, ఎం.సుజయ్, దీప్, బ్లూ వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్లు కోచ్ పి.భార్గవి తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈనెల 9 నుంచి 11వతేదీ వరకూ రాష్ట్రస్థాయిలో అనంతపురంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఆమె చెప్పారు.


ముంగండ హైస్కూల్‌లో తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ పి.భార్గవి

చాగంటికి కలిసిన ఎంపీ సతీష్‌బాబు


కాకినాడ సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల మోకాలి శస్త్రచికిత్స చేయించుకుని పూర్తిగా కోలుకున్న రాష్ట్రప్రభుత్వ సలహాదారు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. గతేడాది విద్యార్థుల నీతి, విలువల ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా చాగంటి నియమితులయ్యారు.


చాగంటికి పట్టువస్త్రాలు అందజేస్తున్న ఎంపీ సతీష్‌బాబు

ఉపాధ్యాయుడిగా మారిన అనపర్తి ఎమ్మెల్యే

- పర్యావరణంపై విద్యార్థులకు బోధించిన రామకృష్ణారెడ్డి

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 5(ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉపాధ్యాయుడిగా మారారు. బ్లాక్‌బోర్డుపై పాఠాలు చెప్తూ టీచర్ అవతారం ఎత్తారు. గురువారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించడంలో విద్యార్థులు ముందంజలో ఉండాలని వారికి బోధించారు. మండల కేంద్రమైన పెదపూడిలోని శ్రీవిజ్ఞాన్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు కొద్దిసేపు పాఠాలు బోధించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పర్యావరణం.. దాని ఆవశ్యకతపై కాసేపు పాఠం బోధించారు. తరగతి గదిలోకి వెళ్లగానే ఆయన టీచర్‌గా మారిపోయారు. విద్యార్థులతో ఎమ్మెల్యేగా కాకుండా ఒక పాఠశాల ఉపాధ్యాయుడిగా ప్లాస్టిక్ నివారణ మొక్కల పెంపకం పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను 20 నిమిషాలపాటు చక్కగా వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ముందుండాలని పిలుపునిచ్చారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పాఠశాల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెదపూడి గ్రామ సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, విద్యావేత్త, సామాజికకార్యకర్త వీఎస్ఎన్ మాస్టారు, టీడీపీ నాయకులు పుట్ట గంగాధర్‌చౌదరి, అమ్మన్న చౌదరి, డీసీ చైర్మన్ సాన శ్రీనివాసరావు, దత్తుడు, జనసేన నాయకులు నాగు పాల్గొన్నారు.


పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కాకినాడ జిల్లాలో రేపటినుంచి ట్రాఫిక్ మళ్లింపు

- సామర్లకోట-అచ్చంపేట రోడ్డులో బ్రిడ్జి పనుల కారణంగా మార్పు

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో సామర్లకోట నుంచి అచ్చంపేట వెళ్లే రహదారిలో శుక్రవారం నుంచి ట్రాఫిక్ మళ్లించనున్నారు. ఇక్కడ భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా నిర్మాణంలో ఉన్న రోడ్డులో బ్రిడ్జిలకు గడ్డర్లు లేవుతున్నందున ముత్యాలమ్మ గుడి దగ్గర ఓవర్ బ్రిడ్జి గడ్డర్ లాంచ్ కోసం సామర్లకోట నుంచి కాకినాడ కలెక్టరేట్ వైపునకు వచ్చే కెనాల్ రోడ్డు రహదారికి ట్రాఫిక్ మళ్లింపు ఈనెల 7 నుంచి 10 వరకు నిలుపుదల చేస్తున్నామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అచ్చంపేట జంక్షన్‌లో కూడా రోడ్డుపై గడ్డర్‌లు లేవుతున్నందున ఈనెల 11 నుంచి 13 వరకు ట్రాఫిక్ మళ్లిస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి పోలీసు వారు సూచించిన మార్గాల్లో తమ వాహనాలను మళ్లించాలని సూచించారు.

మరిడమ్మ జాతరకు పందిరిరాట ముహూర్తం

పెద్దాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ఆషాఢమాసంలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పందిరిరాట ముహూర్తం నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతంగా సాగేందుకు పూజలు జరిపి అష్టదిక్పాలకులను ఆహ్వానించా మని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, వేద పండితులు, అర్చకులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


మరిడమ్మ ఆలయ ఆవరణలో పందిరిరాట వేస్తున్న దృశ్యం

గుర్తు తెలియని వాహనం ఢీకొని

యువకుడి దుర్మరణం



రోడ్డుపై పడి ఉన్న గంగయ్య మృతదేహం

ఎటపాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం శివారు జాతీయరహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందులో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... లక్ష్మీపురం పంచాయతీ పాలమడుగు సమీపంలోని ఎర్రకాలువవలసకి చెందిన మడివి గంగయ్య (30) ద్విచక్ర వాహనంపై చత్తీస్‌గడ్‌లోని అత్తగారి ఊరైన సుక్మా వెళ్తున్నాడు. ఈలోగా లక్ష్మీపురం మలుపు వద్దకు రాగానే చింతూరు వైపు నుంచి భద్రాచలం వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో గంగయ్య తల పగిలి, మెదడు బయటకు వచ్చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఢీకొట్టిన వాహన చోదకుడు ఆపకుండా వెళ్లిపోయాడు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారాలతో తమిళనాడుకు చెందిన ఐషర్ వ్యాన్‌గా గుర్తించారు. వ్యాన్, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అప్పలరాజు తెలిపారు.

చెట్టు కొమ్మ విరిగిపడి చిన్నారి మృతి

● మరో చిన్నారికి గాయాలు



చిన్నారి అక్షర (ఫైల్)

ధవళేశ్వరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు కావడంతో ఆ చుట్టుపక్కల చిన్నారులంతా చేరి చెట్టునీడన ఆటలాడుకుంటున్నారు. ఆ చెట్టే ఓ చిన్నారి పాలిట మృత్యువు అవుతుందని ఎవరూ ఊహించలేకపోయారు. గురువారం ఉదయం పది గంటల సమయంలో ధవళేశ్వరంలోని స్థానిక బస్టాండ్ వెనుక వీధిలో ఉన్న రావిశెట్టి నీడలో పాతూరి అక్షర (9), దావదాసి లిషితతో పాటు మరికొందరు పిల్లలు ఆటలాడుకుంటున్నారు. అదే సమయంలో రావిచెట్టు నుంచి భారీ కొమ్మ ఒక్కసారిగా విరిగిపడి... పక్కనే ఉన్న కరెంట్ స్తంభంపై పడి, ఆపై చిన్నారులు అక్షర, లిషితపై పడడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. దీన్ని చూసిన స్థానికులు, బంధువులు హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో అక్షర మృతి చెందగా, లిషిత ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చిన్నారి మృతితో కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్న తండ్రి త్రిమూర్తులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. దీంతో ఆ పేటలో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాదకరంగా ఉన్న ఆ చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి విరిగిపోయిన కరెంట్ స్తంభం, తెగిపోయిన వైర్లను తొలగించారు. అయితే ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ గణేష్ తెలిపారు.

తప్పిన పెద్ద ప్రమాదం

● అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ప్రమాదానికి గురైన బస్సు

మోతుగూడెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో గురువారం భద్రాచలం నుంచి పాడేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అయితే ఆ సమయానికి అక్కడ విద్యుత్ సిబ్బంది జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్నారు. అయితే ఎవరికీ ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో 11 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. చిన్న చిన్న గాయాలవ్వడంతో డొంకరాయి ఏపీ జెన్కో భవ్య హెల్త్ సెంటర్‌లో ప్రథమ చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.భాస్కర్ ప్రయాణికులు ఎక్కడికి వెళ్లాలో తెలుసుకుని సీలేరుకు చెందిన డీఏవీ స్కూల్ బస్సులో దింపాలని ఆదేశించారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రోత్సాహమేదీ..?

● ఉమ్మడి జిల్లాలో తగ్గుతున్న కూరగాయల సాగు విస్తీర్ణం.. పెరుగుతున్న ధరలు

● వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారడమే ప్రధాన కారణం

● గత వైసీపీ ప్రభుత్వంలో రాయితీలు నిలిపివేత

● కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరిస్తారని కొండంత ఆశతో రైతన్న



పొట్లపాదుల తోటలో ఓ రైతు



సామర్లకోట, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో కూరగాయల సాగు విస్తీర్ణం ఊహించని రీతిలో తగ్గుతూ వస్తోంది. దీనికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువు కాగా, గ్రామాల్లో సైతం వ్యవసాయ భూములు రియల్‌ఎస్టేట్ వెంచర్లుగా మారుతుండడమే దీనికి ప్రధాన కారణం. కాగా రాష్ట్రప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా కూరగాయల తోటల పెంపకాలకు అందిస్తున్న రాయితీలను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిలిపివేయడంతో కూరగాయల తోటల పెంపకందారులు ఇటీవల వరకు నిరాసక్తత చూపారు. దీంతో కొత్త పంటలు కూడా వేయాలన్న ధ్యాస వారిలో కొరవడింది. అయితే ఊహించని రీతిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కూరగాయలు పండించే రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. గతంలో వలే కూటమి ప్రభుత్వం కూరగాయల పంటలకు ప్రోత్సాహాన్ని ఇస్తుందని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు మండలాలలో దాదాపు 45 వేలఎకరాల్లో కూరగాయల పంటలు సాగయ్యేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో 25వేల ఎకరాలకు పడిపోయిందని ఉద్యానవన శాఖ అధికారుల గణాంక సమాచారంగా తెలుస్తోంది. పట్టణాల్లో జనాభా గణనీయంగా పెరగడంతో స్థానికంగా సాగవు తున్న కూరగాయలు ప్రజల అవసరాలను ఏమాత్రం తీర్చలేకపోవ డంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతులు అయ్యే దానిపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ కారణంగా కూరగాయల ధరలు అనూహ్యంగా పెరుగుతు న్నాయి. అధిక మండలాల్లో కూరగాయల సాగు ఆశాజనకంగా ఉండేది. ఉమ్మడి తూర్పుజిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల నుంచి సైతం బీన్స్, వంగ, మునగ, చిక్కుడు వంటి ప్రత్యేక పంటలు ఆయా ప్రధాన మార్కెట్లు, వారపుసంతలు, రైతుబజార్లకు విరివిగా వచ్చేవి. రోజుకు 60 నుంచి 70 మెట్రిక్ టన్నుల వరకూ కూరగా యలు మార్కెట్లకు చేరేవి. కాకినాడ, రాజ మహేంద్రవరం, అమలాపురం, పెద్దాపురం, ఏలేశ్వరం, రాజానగరం, రావుల పాలెం, తుని, ప్రత్తిపాడు తదితర ప్రధాన ప్రాంతాల ప్రజలకు నిత్యం కూర గాయలు అందుబాటులో ఉండేవి. అయితే నేడు జిల్లా ప్రజల అవస రాలలో కేవలం 40 శాతం కూరగా యల మాత్రమే స్థానికంగా పండుతున్నాయి. మిగిలిన కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు చేసుకోవాల్సి వస్తోంది. బెంగళూరు నుంచి క్యారెట్, బీట్ రూట్, క్యాప్సికమ్, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వంగ, బెండ, కంద, చేమ, కాలీఫ్లవర్, క్యాబేజీ, తదితర కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నారు.

● ప్రభుత్వ ప్రోత్సాహం శూన్యం

జిల్లాలో కూరగాయలు, ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు గత వైసీపీ ప్రభుత్వం రాయితీలు, సలహాలు, సూచనలను అందించలేదు. విత్తనాల కోసం హెక్టార్ విస్తీర్ణానికి రూ. మూడు వేలు చొప్పున గతంలో టీడీపీ ప్రభుత్వం సబ్సిడీగా చెల్లించేది. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఇవేమీ చెల్లించలేదు. గత ఐదేళ్ల పాలనలో ఈ పంటలు పర్యవేక్షించే ఉద్యానవన శాఖ ద్వారా నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. కూరగాయల పంటలపై చీడపీడలు, పురుగులు, తెగుళ్లు ఆశించినపుడు మందుల పిచికారీ చేసే స్ప్రేయర్లపై రూ. 28 వేల వరకూ ప్రభుత్వ సబ్సిడీ ఇవ్వాల్సి ఉంది. బిందు, తుంపర సేద్య పరికరాలకు గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో కూరగాయల రైతులకు 50 నుంచి 100 శాతం వరకూ రాయితీలు అందేవి. తీగ జాతి కూరగాయల పంటలు సాగు చేసే రైతులు పందిళ్లు వేసుకునేందుకు రూ. లక్ష వరకు ప్రభుత్వ సబ్సిడీగా వచ్చేది. ఇవన్నింటినీ వైసీపీ పాలనలో పూర్తిగా నిలిపివేశారు. ఈ దశలో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో కూరగాయల సాగు కాలక్రమేణా తగ్గిపోయింది. గత టీడీపీ పాలనలో అందించిన ప్రోత్సాహకాలు తిరిగి ఇప్పుడు మళ్లీ పునరుద్ధరిస్తారని వేయి కళ్లతో రైతులు ఎదురుచూస్తున్నారు.

గిట్టుబాటు ధర లేదు

- సత్తి మంగాధర్, పనసపాడు, రైతు, సామర్లకోట మండలం.

కూరగాయల సాగుకు గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పంటలకు వేసే ఎరువులు, పురుగుమందుల ధరలు బాగా పెరిగిపోయాయి. తీరా అప్పులు చేసి కూరగాయల పండించిన తర్వాత గిట్టుబాటు ధరలు లభించక దళారులు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఉంది. దీంతో తెచ్చిన రుణాలకు వడ్డీల భారం పెరిగిపోతుంది. అందువల్ల పంట సాగు చేయలేకపోతున్నాం.

ప్రభుత్వమే ఆదుకోవాలి

- బత్తిన శ్రీను, రైతు, సూరంపాలెం, గండేపల్లి మండలం

కూరగాయల రైతులను ప్రభుత్వమే పూర్తిగా ఆదుకోవాలి. గతంలో ప్రభుత్వాలు సబ్సిడీలపై విత్తనాలు, ఎరువులు, స్ప్రేయర్లు, బిందు, తుంపర, తదితర సాగు పరికరాలు అందించేవి. వైసీపీ హయాంలో పూర్తిగా నిలిపివేసి రైతులను తీవ్ర ఇబ్బందుల పాల్జేశారు. ఇకనైనా ఈ ప్రభుత్వం తగుచర్యలు తీసుకోవాలి.

ఒంటరితనం భరించలేక యువకుడి ఆత్మహత్య

నిడదవోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) :ఒంటరితనం భరించలేక ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన ఏజర్ల విక్రమ్(19) తల్లి కువైట్‌లో ఉండగా..తండ్రి వైజాగ్‌లో ఉంటూ చేపల చెరువు వద్ద పనిచేస్తున్నాడు. మంచిలిలో విక్రమ్ ఒక్కడే ఉంటున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలో ఉన్న మేనత్త ఇంటికి వచ్చాడు. చాలా సేపు అక్కడ గడిపాడు. అనంతరం మేనత్తతో ఒంటరితనం భరించలేకపోతున్న ట్టు చెప్పాడు. మేనత్త ఏదో సర్దిచెప్పింది. అయినా పట్టించుకోలేదు. కాసేపటికే వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగేశాడు. ఇది గమనించిన బంధువులు వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ తెలిపారు.

టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభానికి సీఎం



టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ/రూరల్/కడియం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సీఎం చంద్రబాబు ఈ నెల 10 లేదా 11 తేదీల్లో ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి బొమ్మూరులోని ఆర్టీఐహెచ్ భవనంలోని టాటా ఇన్నోవేషన్ హబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికత, ఇన్నోవేషన్ యువతలోని నైపుణ్యం కలిగిన వారి అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నం, రాజమండ్రి, ఎన్టీఆర్, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో ప్రభుత్వం టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మన జిల్లాలో అడ్వాన్ స్కోప్‌మోడల్‌లో ఈ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఈహబ్ నిర్వహణ విషయంలో గ్రీన్ కోఎనర్జీ, ఓఎన్‌జీసీ, గెయిల్, అవంతి సంస్థలు ప్రమోటర్లుగా ఉంటాయన్నారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి, తద్వారా ఒక శక్తివంతమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి ఈ ఇన్నోవేషన్ హబ్ దోహద పడుతుందన్నారు. ప్రతిఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్ల పరిశీలన చేశామన్నారు. ఇదిలా ఉండగా కడియం మండలం వేమగిరి గతంలో మహానాడు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. హెలీపాడ్ ఏర్పాటుకు ఈ స్థలాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ కిషోర్, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు.

10 లేదా 11 తేదీల్లో చంద్రబాబు

ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ ప్రశాంతి

బట్టల వ్యాపారి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ జిల్లా మండపేట రూరల్ ద్వారపూడికి చెందిన బట్టల వ్యాపారి ఎం.వీరబాబు(40) తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. ద్వారపూడికి చెందిన వీరబాబుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతడు అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. గురువారం రాజమహేంద్రవరం దోబీ ఘాట్ వద్ద గోదావరిలో మృతదేహం ఉన్నట్టు స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అతను ద్వారపూడికి చెందిన వీరబాబుగా గుర్తించారు. భార్య, బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు

వేసవి ప్రయాణికులకు సదుపాయాలు



సామర్లకోట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రయాణికులు సొంత గ్రామాల నుంచి నగరాలకు బయలుదేరే రోజులు సమీపించినందున పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో అదనపు బోగీలను ఏర్పాటు చేసినట్టు రైల్వే సంస్థ ప్రకటించింది. సామర్లకోట రైల్వే స్టేషన్ మీదుగా అటు విజయవాడ, ఇటు విశాఖల వైపు ప్రయాణించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పెంచి అదనపు బోగీల సమాచారాన్ని గురువారం సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందించగా ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది.

● 08581, 08582 నెంబర్లు గల విశాఖపట్నం-బెంగుళూరు-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనంగా ఒక ఏసీ 3-టైర్ బోగీని జతచేసి జూన్ 29 వరకూ అందుబాటులోకి ఉంచనున్నారు.

● 08579, 08580 నెంబర్లు గల విశాఖపట్నం-చర్లపల్లి-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనంగా ఒక ఏసీ 3-టైర్ బోగీని జతచేసి జూన్ 6నుంచి 27 వరకూ అందుబాటులో ఉంచనున్నారు.

● ఇంకా భువనేశ్వర్-న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్, పూరి-యశ్వంత్‌పూర్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సైతం అదనపు బోగీలను ఏర్పాటు చేసినందున రిజర్వేషన్ తదితర సమాచారం కోసం సమీప రైల్వే స్టేషన్లలో బుకింగ్ కార్యాలయాలు తెరిచి ఉన్న సమయంలో రైల్వే సిబ్బందిని సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయ అధికారులు తెలిపారు.

● రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌ల్లో పలు రైళ్లకు తాత్కాలిక స్టాప్‌ను మరో 6 నెలలు పొడిగిస్తూ రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయించారని రైల్వే పీఆర్వో తెలిపారు. రామేశ్వరం-భువనేశ్వర్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్, హౌరా-పుదుచ్చేరి-హౌరా ఎక్స్‌ప్రెస్‌లు పొడిగించిన తాత్కాలిక స్టాప్ రైళ్లల్లో ఉన్నట్టు తెలిపారు.

కాకినాడ అపోలోలో అరుదైన శస్త్ర చికిత్స



విలేకరుల సమావేశంలో అపోలో వైద్య బృందం

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన జంప మంగాయమ్మ వయసు 54. ఆమె గత నెల 25న ఫోను మాట్లాడుతూ చేపల కూరతో భోజనం చేస్తుండగా ఛాతి, ఉదర భాగంలో నొప్పి వచ్చింది. వెంటనే కాకినాడలోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ జి.వంశీచైతన్య పరిశీలించి సీటీ స్కాన్ చేయించారు. అందులో సుమారు నాలుగు సెంటీ మీటర్లు పొడవు ఉన్న ఒక చేప ముల్లు గుండె పెద్ద రక్తనాళం బయట గుచ్చుకుని ఉండడం గమనించారు. వాస్క్యులర్ ఎస్వీఆర్ కృష్ణ, డాక్టర్ వంశీ చైతన్య, డాక్టర్ ఎస్వీకృష్ణ పరిశీలించి సు మారు 10నుంచి 12గంటలు చేయవలసిన ఆపరేషన్‌ను అత్యంత మెళకువలు ఉపయోగించి కేవలం 3 గంటల్లోనే పూర్తి చేశారు. ముల్లును బయటకు తీశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా దేశంలోనే రెండోసారిగా నూతన విధానంతో ప్రణాళిక సిద్ధం చేసి ప్రముఖ గుండె మత్తు డాక్టర్ ప్రగడ నాగేశ్వరరావు, డాక్టర్ వంశీచైతన్య, డాక్టర్ ఎస్వీఆర్ కృష్ణ సమక్షంలో ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన వైద్యుల బృందాన్ని అపోలో ఆసుపత్రి సీఈవో డాక్టర్ రాచకొండ రెడ్డప్పరెడ్డి అభినందించారు.

భారత్, అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం అవసరం

ఎంపీ హరీష్ మాధుర్



అమెరికాలో లీసామెక్లేన్‌ను కలసుకున్న భారత ప్రతినిధి బృందం

అమలాపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలను ప్రపంచ దేశాలకు తెలియజేసేందుకు వెళ్లిన ప్రతినిధి బృందం అమెరికా హైస్ రిపబ్లిక్ కాన్ఫరెన్స్ ఛైర్ ఉమెన్ లీసామెక్లేన్‌తో భేటీ అయ్యారు. అమెరికా హౌస్ రిపబ్లికన్ కాన్ఫరెన్సుకు కొత్తగా ఎన్నికైన ఛైర్ ఉమెన్, కాంగ్రెస్ ఉమెన్ లీసామెక్లేన్‌తో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి భేటీ అయ్యారు. అఖిలపక్ష విదేశీ పర్యటనలో భాగంగా ఎంపీ శశిధరూర్ నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో ప్రారంభమైన ఈ చర్చ భారత్ అమెరికాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, చైనాకు వ్యతిరేకంగా సహకారం, డిజిటల్, రక్షణ, వాణిజ్య సహకారం వంటి అంశాలపై చర్చించినట్టు ఎంపీ హరీష్ తెలిపారు. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు పాదర్శకతతో తీసుకువచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లు, వికసిత్ భారత్ లక్ష్యంపై మెక్లేన్ ఆసక్తి చూపారని, ఆమెను భారత్ పర్యటనకు ఆహ్వానించినట్టు హరీష్ పేర్కొన్నారు.

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో స్నానానికి దిగిన యువకుడు ప్రమాదవశాత్తూ మునిగిపోయి నీళ్లు తాగి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలో పెంటపాడు గ్రామానికి చెందిన పాలిక అభిరామ్(23) స్నేహితులను కలిసేందుకు రాజమహేంద్రవరం వచ్చాడు. స్థానిక శ్రీరాం నగర్‌లో ఉన్న స్నేహితుల వద్దకు వచ్చి అక్కడి నుంచి స్నేహితులతో కలిసి గోదావరి స్నానానికి పుష్కరాల రేవుకు గురువారం సాయంత్రం వెళ్లారు. స్నానం చేస్తుండగా అభిరామ్ ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. అతడిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించే సరికి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు అభిరామ్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు అప్పన్న ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన అప్పన్నను అభినందిస్తున్న జిమ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణానికి చెందిన బి.అప్పన్న జాతీయస్థాయి పోలీసు పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న ఏపీ ప్రత్యేక రక్షణదళం కానిస్టేబుల్ అప్పన్న నాగార్జున యూనివర్శిటీలో జరిగిన పోలీసు సెలెక్షన్ ట్రైల్స్‌లో పవర్‌లిఫ్టింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిమ్‌లో గురువారం అప్పన్నను అల్లాడ వెంకటరమణ, మట్టపర్తి వెంకటసముద్రం, ముత్తాబత్తుల వెంకటరమణ, తిక్కా మురళీ, కట్టా బుజ్జి, వాకపల్లి దొరబాబు, పిల్లి వందన తదితరులు జిమ్‌కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సత్కరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ఛైర్మన్ కామన



సమావేశంలో మాట్లాడుతున్న కామన ప్రభాకర్రావు

కాకినాడ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ఛైర్మన్ కామన ప్రభాకరరావు కోరారు. కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం కిసాన్ సెల్ జిల్లా సమావేశం డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభాకరరావు మాట్లాడుతూ తాము రైతులకు అండగా ఉంటామన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు సత్యానందరావు, ఏఐసీసీ సభ్యుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా వెంకటప్రసాద్, డీసీసీ అధికార ప్రతినిధి మారోతి శివగణేష్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు ప్రసంగించారు. కిసాన్ సెల్ రాష్ట్ర ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా కాకినాడ విచ్చేసిన ప్రభాకరరా వును సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ చిలుకోటి పాండురంగారావు, పీసీసీ సభ్యుడు పోలిశెట్టి శ్రీనివాసరావు, నీరుకొండ సత్యనారాయణ, మేడిద శ్రీనివాసరావు, దవులూరి ధనకోటి, బావిశెట్టి సత్యనారాయణ, వనుం వెంకటరమణ, బత్తుల లలిత తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఆధ్యాత్మికత అందరికి అవసరం: ఎమ్మెల్యే గోరంట్ల



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత ప్రతిఒక్కరి జీవితంలో అవసరమని తద్వారా ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలోని జేగురుపాడులో గారపాటి వంశీయుల ఆడపడుచుగా పూజలు అందుకుంటున్న మహాలక్ష్మి అమ్మవారితో పాటు, ఆలయంలో కొలువైన పోలేరమ్మను గురువారం గారపాటి అమరనాథ్, కుటుంబసభ్యులు మేళతాళాలతో వారింటికి తీసుకొచ్చి పూజలు చేశారు. సారె, చీరె సమర్పించారు. అనంతరం అమ్మవార్లను ఆలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమానికి విచ్చేసి ఎమ్మెల్యే గోరంట్ల అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాతూరి సత్యనారాయణ, వెలుగుబంటి ప్రసాద్, డా. గోరంట్ల రవి రామ్‌కిరణ్, మార్గాని సత్యనారాయణ, బోడపాటి గోపి, పాతూరి రాజేష్, నాగిరెడ్డి రామకృష్ణ చెల్లుబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాల అందజేత



విద్యార్థికి నగదు బహుమతి అందజేస్తున్న డీఈవో వాసుదేవరావు

కడియం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని 9 ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతిలో టాపర్‌గా నిలిచిన 11 మంది విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు రూ.1 లక్ష నగదు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. నూరుశాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.సుధ, జయలక్ష్మి, టి.సత్యనారాయణ, ఈవీవీ ప్రసాద్, జి.సత్యనారాయణలను సత్కరించారు. పల్ల వెంకన్న 89వ జయంతి సందర్భంగా కడియపులంకలో ఆయన విగ్రహం వద్ద పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పల్ల సత్తిబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమాలు చేపట్టారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మార్గాని సత్యనారాయణ, ఈలి గోపాలం, తిరుమలశెట్టి శ్రీను, పల్ల వెంకటేష్, పల్ల వినయ్, బుద్ధవిహార్ వ్యవస్థాపకుడు వై.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

హుండీల దొంగ అరెస్టు

రూ.95,030 నగదు స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లోని దేవాలయాల్లో హుండీలను పగులగొట్టి దోపిడీ చేస్తున్న దొంగను త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారని సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు తెలిపారు. గురువారం సాయంత్రం త్రీటౌన్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లోని దేవాలయాల్లో వరుసగా హుండీల దొంగతనాలు జరుగుతుండడంతో అడిషనల్ ఎస్పీ అర్జున్ సూచనలతో త్రీటౌన్ పోలీసులు నిఘా ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో లింగంపేట వద్ద పారేపల్లి బాబిని అదుపులోకి తీసుకున్నారు. బాబి కాకినాడ జిల్లా తొండంగి మండలం ఆనూరు గ్రామం రామాలయం ప్రాంతానికి చెందిన వాడు. జూదాలు, జల్సాలకు అలవాటు పడి డబ్బు అవసరాలకు క్రైమ్ సినిమాలు చూడడం, యూట్యూబ్‌లో దొంగతనాలు వీడియాలు బాగా చూసేవాడు. ఆటోలు అద్దెకు తీసుకుని రాత్రుళ్లు తిరుగుతూ గుళ్లలో హుండీలను పగులగొట్టి దొంగతనాలు చేసేవాడు. బాబి రాజమహేంద్రవరం త్రీటౌన్ పరిధిలో నాలుగు, కోరుకొండ పరిధిలో ఒక నేరం చేసినట్టు అంగీకరించాడని డీఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి రూ.95,030 నగదు, దొంగతనానికి ఉపయోగించిన ఆటో, ఎలక్ట్రికల్ కట్టర్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. బాబిపై గతంలో పాయకరావుపేట, తుని, నర్సీపట్నం పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని తెలిపారు. హుండీ దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన త్రీటౌన్ సీఐ, పోలీస్ సిబ్బందిని ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.

రూ.1 కోటితో చాగల్నాడు అభివృద్ధి

కాలువలో పూడిక తీత పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సూర్యారావుపేటలో పూడికతీత ప్రారంభించిన అధికారులు

రాజానగరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): చాగల్నాడు కాలువలో పూడికతీత పనులను అధికారులు ఎట్టకేలకు చేపట్టారు. ఈ నెల 2న కాలువ్య కోరల్లో చాగల్నాడు కాలువ శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం పూడికతీత పనులకు ఉపక్రమించారు. దీనిలో భాగంగా జాతీయ రహదారిని ఆనుకుని సూర్యారావుపేట సమీపంలో జ్యోతుల పాపారావు మెమోరియల్ పార్క్ వద్ద కాలువ అభివృద్ధి కమిటీ చైర్మన్ అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు గురువారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఈ పి.సత్యనారాయణ మాట్లాడుతూ చాగల్నాడు కాలువ అభివృద్ధికి రూ.1కోటి మంజూరైనట్టు చెప్పారు. ఈ నిధులతో పాలచర్ల పంపింగ్ స్కీమ్ నుంచి వడిశలేరు వరకు 14 కిలోమీటర్ల మేర పూడికతీత పనులతో పాటు పంపింగ్ స్కీమ్ షట్టర్లు రిపేర్లు చేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ పి.పురుషోత్తం దొర, కాలువ నీలపాల వెంకటేశ్వరరావు, జనసైనికులు పాల్గొన్నారు.

జనాభా నిర్వహణ విధానంపై పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జనాభా నిర్వహణ విధానానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆవిష్కరించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జనాభా సమతుల్యత సాధించే దిశలో జూన్ 20లోగా జనాభా నిర్వహణ విధానంపై ఆలోచనలు పంచుకోవాలన్నారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. జనాభా నిర్వహణ విధాన రూపకల్పనలో జిల్లాలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు ముఖ్యప్రణాళిక శాఖ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి తొమ్మిది ప్రశ్నలకు సంబంధించి ప్రజలు తమ విలువైన అభిప్రాయాలను ఈనెల 20లోగా పంచుకోవాలనికోరారు. రాష్ట్రంలో వేగంగా మారుతున్న జనాభా మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక జనాభా నిర్వహణ విధానాన్ని రూపొందించే యోచనలో ప్రభుత్వం ఉందని, అందులో భాగంగానే ప్రజల నుంచి విలువైన సూచనలు సలహాలతో కూడిన అభిప్రాయ సేకరణ ప్రక్రియ చేపట్టనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి జేడీఎల్ అప్పలకొండ, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీపీవో వి.శాంతామణి, డీఈవో కె.వాసుదేవరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్సీ బీవీ గిరి, జిల్లా భూగర్భ జల అధికారి వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే నల్లమిల్లి.. కొత్తూరులో రూ.33 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం

అనపర్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమాల్లో అనపర్తి నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలపడమే ధ్యేయమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అనపర్తి శివారు కొత్తూరులో రూ.33లక్షల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ముందుగా కమ్యూనిటీ హాలు అభివృద్ధి పనులకు, నేత్ర వైద్యుడు తేతలి సత్యనారాయణరెడ్డి సౌజన్యంతో నిర్మించిన వంట షెడ్డును, సీసీ రోడ్డును, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో చేయని అభివృద్ధిని ఏడాది కాలంలో రూ.95 కోట్లతో చేశామని రానున్న రోజుల్లో మరింత చేస్తామన్నారు. కార్యక్రమంలో సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కర్రి శేషారత్నం, సిరసపల్లి లక్ష్మి, సుభాషిణి, చింతా ప్రకాశరెడ్డి, కర్రి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే రైతులకు రూ.19లక్షల విలువ చేసే వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను పంపిణీచేశారు. అలాగే ఐసీడీఎస్ పరిధిలో ఎంపికైన ఆయాలకు ఎమ్మెల్యే నియామక పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆళ్ల గోవిందు, వెలుగుబంటి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

డీలర్లకు ఇచ్చినా ఇంతే..రేషన్‌బియ్యం పక్కదారి

సీతానగరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. యథేచ్ఛగా వ్యాన్‌లలోను, ద్విచక్ర వాహనాలపైన రవాణా చేస్తున్నారు.గురువారం ముగ్గళ్ల గ్రామం నుంచి సీతానగరం వైపు ద్విచక్రవాహనాలపై సుమారు 4 క్వింటాళ్ల రేషన్ బియ్యం (పీడీఎస్) తరలిస్తుండగా విలేకరుల కెమెరాకు చిక్కింది. రేషన్ షాపులు పునః ప్రారంభమై వారం రోజులు కూడా కాకముందే మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరందుకుంది. డీలర్లపై నమ్మకంతో ప్రభుత్వం రేషన్ షాపులను పునఃప్రారంభించగా డీలర్లు మాత్రం ఇదే అదనుగా బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అధికారులకు తెలిసినా తెలియనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు అనుకుంటున్నారు. రేషన్ షాపుల వద్ద రేషన్ తీసుకోవడానికి వచ్చిన వారి వద్ద కిలో రూ.14కు కొనుగోలు చేసుకుని తిరిగి వాటిని వేరే ప్రాంతాలకు తరలించి కిలో రూ.20 నుంచి రూ.22 వరకు అమ్మకాలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. దీని వల్ల రేషన్ షాపులు ప్రజల విశ్వాసం కోల్పోతున్నాయి.

రాష్ట్ర మహాసభకు ఉద్యోగులు

కొవ్వూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర మహాసభలకు కొవ్వూరు నుంచి రెండు బస్సుల్లో ఉద్యోగ సంఘాల నాయకులు తరలివెళ్లారు. గురువారం ఉదయం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద సభకు వెళ్తున్న వాహనాలకు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ ప్రశాంతి, వీసీ ప్రసన్నశ్రీ
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- పలుచోట్ల వన మహోత్సవం
- నన్నయ యూనివర్శిటీలో మొక్క నాటిన కలెక్టర్



నన్నయ వర్శిటీలో మొక్క నాటిన కలెక్టర్ ప్రశాంతి, వీసీ ప్రసన్నశ్రీ

రాజానగరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పలుచోట్ల గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రసన్నశ్రీతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. నన్నయ వర్శిటీకి ఎప్పుడు వచ్చినా సొంత ప్రదేశానికి వచ్చిన అనుభూతి కలుగుతుందని ప్రశంసించారు. ప్రభుత్వం సంకల్పించే కార్యక్రమాలను నిర్వహించడంలో వీసీ ముందుంటారన్నారు. విశ్వవిద్యాలయంలో తక్కువ స్థలంలోనే ఎక్కువ పచ్చదనానికి ఎంతో ఉపయుక్తంగా అకిరా మియావాకి విధానంలో మొక్కలు పెంచేలా ప్రయత్నం చేద్దామన్నారు. వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ప్రకృతిపై మనకు ఎంత హక్కు ఉందో దానిని పరిరక్షించాల్సిన బాధ్యత అంతకుమించి ఉందన్నారు.మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయంలో రెండు వేలకు పైగా మొక్కలకు జియో ట్యాగ్ చేసి పరిరక్షిస్తున్నామని, భూగర్భ జలాలను పెంపొందించి మరిన్ని మొక్కలను నాటేలా ప్రయత్నిస్తున్నారు. అనంతరం పర్యావరణ ప్రతిజ్ఞ చేసి, అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి మూర్తి, వర్శిటీ అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రాజానగరంలోని పీహెచ్‌సీ, గ్రామ సచివాలయ ప్రాంగణాల్లో జరిగిన వన మహోత్సవంలో భాగంగా జనసేన పార్టీ నాసేన కోసం నావంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేఏ ఝాన్సీరాణి, తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గట్టు రామభాస్కర్, సెర్ప్ ఏపీఎం గుమ్మడి సునీత, జనసైనికులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో సుమారు 20 నుంచి 25 సెంట్లు స్థలంలో మొక్కలు పెంచే కార్యక్రమం చేపడుతున్నట్టు ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారన్నారు. అన్ని పంచాయతీల్లో అకిరా మియావకి విధానంలో వనాలను అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు.

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి లాకుల వద్ద జరిగిన పర్యావరణ దినోత్సవంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కాలువ గట్టుపై ఉపాధిహామీ పథకం ద్వారా సమకూర్చిన 60 మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలంటూ గ్రామంలోని డ్వాక్రా మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణాన్ని రక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్‌లు కొవ్వూరి సీతారత్నం, వాసంశెట్టి రవికుమార్, కూటమి నాయకులు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పడాల రాము, కర్రి శ్రీనివాసరావు, పడాల చినబుజ్జి, డీవీఆర్, తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్, ఏపీవో అగస్టిన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కొంకుదురు సావరంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బూరులమ్మ అమ్మవార్ని



తొస్సిపూడిలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు.

కడియం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఎంపీడీవో రమేష్‌బాబు పక్షులకు వరికుచ్చులు కట్టి, నీటి కోసం కుండీలను ఏర్పాటు చేశారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో చిలుకూరి శ్రీనివాసరావు, టి.కృష్ణమోహన్, అడపా సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో కార్యాలయ ఏవో సుబ్బారావు పాల్గొన్నారు. దామిరెడ్డిపల్లిలో జనసేన ఆధ్వర్యంలో వనం-మనం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు, ఉపసర్పంచ్ ముద్రగడ జమీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విత్తనాల సాయి, ముద్రగడ సుధ, గాజుల రత్తయ్య పాల్గొన్నారు. వేమగిరిలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకుడు చెల్లుబోయిన శ్రీను, వాసంశెట్టి నాగబాబు, యనమదల రాజు, అప్పారి అన్నవరం పాల్గొన్నారు. మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దామిరెడ్డిపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎస్ఎంసీ, అంగన్‌వాడీ, ఆశా, డ్వాక్రా వీవోఏలు, మేజిక్‌బస్సు టీఎంవో పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక లాలాచెరువులోని చౌడేశ్వరనగర్‌లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విచ్చేసి అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన వుందన్నారు. రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా మార్చాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు చేపట్టిన ఈ కార్యక్రమం ఒక మహాయజ్ఞంలా ముందుకు సాగుతుందన్నారు. గతంలో మాదిరిగా మొక్కలు నాటడంతో సరిపెట్టడం లేదని, ప్రతి మొక్కను సంరక్షించేందుకు ట్రీ గార్డులు ఏర్పాటు చేసే వీలు కల్పించామన్నారు. నాటిన ప్రతి మొక్క బతికి బాగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సెక్రటరీ శైలజా వల్లి, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఈఈలు మాధవి, మదర్సా అలీ షేక్, ఏడీహెచ్‌కే స్వాతి, సీఎంఎం రామలక్ష్మి, డీఈ విరూపాక్ష పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని కుతుకులూరు పంచాయతీ వద్ద సర్పంచ్ గొల్లు హేమతులసి మొక్కను నాటి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఫణికుమార్, డీసీ చైర్మన్ వెంకట సుబ్బారెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: రోటరీ క్లబ్ ఐకాన్స్ ఆధ్వర్యంలో రేకపల్లి దుర్గాప్రసాద్ సారథ్యంలో టౌన్ హాల్ రోడ్‌లో ఇటీవల నేలకొరిగిన 126 సంవత్సరాల వయసున్న మర్రి వృక్షాన్ని తిరిగి నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ తీగల రాజా, ఇమ్మని వెంకట్, అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ, గౌతమి నేత్రాలయం వ్యవస్థాపకుడు వీకే రాజు, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు. స్థానిక సరస్వతీ ఘాట్ సమీపంలో ఏపీ టూరిజం కార్యాలయ ప్రాంగణంలో ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల ఎన్ఎస్ఎస్, యూత్ వలంటీర్లు స్వచ్ఛ భారత్, ప్లాంటేషన్‌లో పాల్గొన్నారు. అక్కడ కలుపు మొక్కలను, వ్యర్థాలను తొలగించి, మామిడి, పనస మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆదిత్య డైరెక్టర్ ఎస్‌పీ గంగిరెడ్డి, పీవో జీవీ నాగేశ్వరరావు, బీహెచ్ రమాదేవి, ప్రిన్సిపాల్ సీహెచ్‌ఫణికుమార్ పాల్గొన్నారు. రైల్వే క్వార్టర్స్ వద్ద ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయం ఎదుట భారత్ వికాస్ పరిషత్ టంగుటూరి ప్రకాశం శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీపీఎస్ నారాయణ, ఎస్.గణేష్, కె.శ్రీనివాసరావు, ఉన్ని కృష్ణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. స్థానిక వెంకటేశ్వరనగర్ వాకర్స్ పార్కు జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్టేట్‌బ్యాంక్ రెండో కాలనీలో మొక్కలు నాటారు. ఉండవల్లి సత్యనారాయణ, పాలూరి నాగేశ్వరరావు, వాసు, సాయిబాబా పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని గుమ్మళ్ళదొడ్డి గ్రామ సమీపంలోని అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ వివేక్‌కుమార్ శుక్లా, జీఎం చంద్రశేఖర్, ఏఎస్‌వో భవానీశంకర్, హెచ్‌ఎస్ఈ మేనేజర్ సూర్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ: కాపవరం గ్రామసచివాలయం వద్ద జరిగిన వన మహోత్సవంలో జనసేన పార్టీ స్టేట్ కమిటీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని మొక్కలు నాటారు. చెట్లు లేకపోతే ప్రాణవాయువుకు లోటు ఏర్పడుతుందని, పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాజుల రాము, వల్లేపల్లి దుర్గారావు, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆనుకుని ఉన్న ట్రైనింగ్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆర్టీసీ జిల్లా అధికారి వైఎస్ఎన్ మూర్తి, రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్బం, సీనియర్ మెడికల్ ఆఫీసర్ సీహెచ్ ప్రసూనాంబ, అక్కౌంట్స్ ఆఫీసర్ ఆర్‌వీ కోటేశ్వరరావు, ఎంపీ ఎస్.నాగలక్ష్మి, ఏఎంఎఫ్ రాజు, గ్యారేజీ, ఆఫీసు, ట్రాఫిక్, సెక్యూరిటీ, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, రెడ్ రిబ్బన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా కళాశాలలో పలు చోట్ల మొక్కలు నాటారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి, అధ్యాపకులు శరత్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు పీవీబీ సంజీవరావు, ఎస్‌వీఎండీ శ్రీనివాస్, లలిత రమ్య, సరణ, జేవీటీ పద్మజ, మేకల శివప్రసాద్, నీలిమ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో మొక్క నాటిన ఎమ్మెల్యే వాసు

పాఠశాలలు తెరిచే నాటికి పుస్తకాలు సిద్ధం

- కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్ సందర్శనలో కలెక్టర్ ప్రశాంతి
- పుస్తకాలు ఇతర సామగ్రి పరిశీలన



కోరుకొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికి అవసరమయ్యే పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, నిఘంటువులు, ఇతర విద్యా సౌకర్యాలు పంపిణీకి సిద్ధం చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం సాయంత్రం కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్‌ను ఆమె సందర్శించి అక్కడ స్టాక్ చేసిన పుస్తకాలు, స్కూల్‌బ్యాగ్‌లు ఇతర కిట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కూల్స్ ప్రారంభించడానికి పుస్తకాలు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థులకు కావాల్సిన పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు తదితరాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 29,935 పాఠ్యపుస్తకాలు నూరు శాతం, 419 ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులు సిద్ధం చేశామన్నారు. విద్యార్థుల వయస్సు, తరగతి దృష్టిలో ఉంచుకుని 3 పరిణామాల్లో పంపిణీకి సిద్ధం చేశామన్నారు. చిన్న బ్యాగ్‌లు 868, మధ్యస్త బ్యాగ్‌లు 1511, పెద్దబ్యాగ్‌లు 3610 పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. కోరుకొండ మండలంలో 1-5వ తరగతి వరకు చదివే విద్యార్థులు 1983 మంది, 6నుంచి 8వ తరగతి వరకు 993 మంది, 9, 10వ తరగతి విద్యార్థులు 744 మంది ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో టి.కుశలవదొర, మండల విద్యావనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర సరఫరాకు ఏర్పాట్లు

డైరెక్టర్ ప్రతాపరెడ్డి

రంగంపేట జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న పాఠశాలలు తెరిచే లోపు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పూర్తి స్థాయిలో పాఠశాలలకు చేరే విధంగా చర్యలు చేపడతామని విద్యార్థి మిత్ర కిట్ల డైరెక్టర్ ప్రతాపరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం రంగంపేట జడ్పీ హైస్కూల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అందించే పుస్తకాలు, బ్యాగులు, గ్రంథాలయ సామగ్రి పాఠశాలలకు చేరుకున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఏఎంవో గౌరీశంకర్, విద్యాశాఖ అధికారులు వి.వెంకట్రాజు, చామంతి నాగేశ్వరరావు, వి.పార్థసారధి పాల్గొన్నారు.

శ్రీ అభయ కనకదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ అభయ కనకదుర్గాదేవి అమ్మవారు. శ్రీ గణపతి, శ్రీ అభయాంజనేయస్వామి వార్ల విగ్రహప్రతిష్ఠాపన కన్నుల పండువగా జరిగింది. ఆర్‌వో సీహెచ్ శ్రీనివాసరావు దంపతులు, సీనియర్ అసిస్టెంట్ పి.రవికుమార్ దంపతులు, డి.శ్రీనివాసరావు దంపతులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటి కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, అకౌంటెంట్ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



నల్లజర్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పోతవరం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు రాక్షసి పుల్లమ్మ (110) గురువారం అనారోగ్యంతో మృతి చెందినట్టు వారి బంధువులు తెలిపారు. ఈమెకు ఇద్దరు కుమారులు లక్ష్మీపతి రాజు, అంజనేయరాజు, కుమార్తెలు పాపయమ్మ, కస్తూరి ఉన్నారు. వీరిపిల్లల మొత్తం 35 మంది వరకు ఉన్నారు. ఐదుతరాల ముదిమనవళ్లను పుల్లమ్మ చూసింది. మరణించేంత వరకు కూడా తన పనులు తాను చేసుకునేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె అంత్యక్రియలు పోతవరంలో నిర్వహించారు. శతాధిక వృద్ధురాలు కావడంతో చూసేం దుకు జనం అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

గోదావరి గట్టున విగ్రహాలు తొలగించం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గోదావరి గట్టు వెంబడి ఉన్న 13 మహనీయుల విగ్రహాలను తొలగించబోమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం స్థానిక పేపర్ మిల్లు వద్ద కృష్ణ సాయి కల్యాణ మండపంలో రాజమండ్రి వారసత్వ సంపద పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో న్యాయవాది మద్దూరి శివ సుబ్బారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. గోదావరి గట్టు సుందరీకరణ పేరుతో రివర్ ఫ్రంట్ నిర్మాణం జరుగుతున్న క్రమంలో అక్కడున్న విగ్రహాలను తొలగిస్తారని వస్తున్న వార్తల విషయమై మాట్లాడుతూ విగ్రహాలను ఒకటే యూనిఫాంగా ఉంచుతామన్నారు. విగ్రహాల ఏర్పాటులో ఏదైనా డామేజ్ జరిగితే, ఆ స్థానే కొత్త విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. రివర్ ఫ్రంట్ నిర్మాణం వల్ల పిండాల రేవు ఉనికికి ఎలాంటి ఇబ్బంది లేకుండా గోశాల పక్కన ఉన్న స్థలంలో అపర కర్మల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. హేవ్‌లాక్ వంతెనను చారిత్రక, పర్యాటక ప్రాంతంగా చేసేందుకు రు.100 కోట్లతో టెండర్ ప్రక్రియ పూర్తయిందని, దానికి అనుబంధంగా రూ.50 కోట్లతో ఘాట్లను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పంతం కొండలరావు, దేశిరెడ్డి బలరామనాయుడు, మాదేటి రవిప్రకాష్, మాదిరాజు శ్రీనివాస్, సానబోయిన రామారావు, ఎల్‌వీ ప్రసాద్, కేకే సంజీవరావు పాల్గొన్నారు.

'అనుమతుల్లేకుండా కబేళా నిర్వహిస్తే చర్యలు'

గోకవరం, జూన్5(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సందర్భంగా ఎటువంటి అనుమతులు లేకుండా కబేళాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ హెచ్చరించారు. రాబోవు బక్రీద్ సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలో ఇప్పటికే మూసి ఉన్న కబేళాలను గురువారం ఆయన ఎస్ఐ పవన్‌కుమార్‌తో కలిసి పరిశీలించి, వాటిని గతంలో నిర్వహించిన యజమానులకు పలు హెచ్చరికలు చేశారు. అనంతరం ముస్లిం పెద్దలతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రశాంతంగా, సంతోషంగా పండుగను జరుపుకోవాలన్నారు. అనుమతుల్లేని జంతు వధశాలలు నిర్వహిస్తే చట్టరీత్యా శిక్షార్హులు అవుతారన్నారు. అదేవిధంగా డ్రైవర్స్ కాలనీలోని తెలగాపాముల వ్యక్తులతో కూడా డీఎస్పీ సమావేశమయ్యారు. ఎటువంటి నేరాలకు పాల్పడరాదని, తమ హెచ్చరికలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ధాన్యం సొమ్ముల కోసం పడిగాపులు

- ఉన్నతాధికారులకు గోడు వినిపించిన బాధిత రైతులు

గోకవరం, జూన్5(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పండించిన వరి పంటకు సంబంధించిన డబ్బులు ఇప్పటివరకు తమ ఖాతాల్లో జమకాక సంబంధిత రైతులు లబోదిబోమంటున్నారు. గత మే నెల 8వ తేదీ దాటిన తరువాత ఆర్‌బీకేల ద్వారా విక్రయించిన ధాన్యానికి ఇప్పటివరకు రైతుల ఎకౌంట్లలో సొమ్ములు జమ కాలేదంటూ మండలంలోని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. పలువురు రైతుల ఖాతాల్లో సుమారుగా రూ.3 కోట్ల వరకు జమ కావాల్సి ఉందని చెబుతున్నారు. బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమైతే ఖరీఫ్ పంట కోసం శిస్తు చెల్లించేందుకు తాము ఇబ్బందులు పడే పరిస్థితులు రావని రైతులు పేర్కొంటున్నారు. ఈ బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ గురువారం బాధిత రైతులు రాజమహేంద్రవరం చేరుకొని జాయింట్ కలెక్టర్ చినరాముడుకు వినతిపత్రం అందజేశారు.

మొక్కను నాటండి.. సంరక్షించండి



మొక్కలు నాటుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే



మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ అధికారి

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మొక్కలను నాటడమే కాదు, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లావ్యాప్తంగా 4 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కమిషనర్ కేతన్‌గర్గ్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం ద్వారా పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ మూర్తి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్‌పై యుద్ధం నినాదంతో ఈ కార్యక్రమం రూపకల్పన చేసినట్టు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో నర్సరీలను అటవీశాఖ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫీసర్ ఎస్ఎస్ఎస్ మూర్తి, రాజమహేంద్రవరం డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఫణీంద్ర ధర్మ, రంపచోడవరం ఫారెస్ట్ రేంజ్ అధికారులు గురువారం సందర్శించారు. జైలు పర్యవేక్షణ అధికారి ఎస్ రాహుల్ జైలులోని జీవ వైవిధ్యం, నర్సరీ అభివృద్ధిని వివరించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎఫ్‌వో శ్రీనివాస్,డీఈవో కే.వాసుదేవరావు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణ ర్యాలీలో జిల్లా జడ్జి సునీత



టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే గోరంట్ల

ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

10,11 తేదీల్లో టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ/రూరల్/కడియం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సీఎం చంద్రబాబు ఈ నెల 10 లేదా 11 తేదీల్లో ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి బొమ్మూరులోని ఆర్ టీఐహెచ్ భవనంలోని టాటా ఇన్నోవేషన్ హబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికత, ఇన్నోవేషన్ యువతలోని నైపుణ్యం కలిగిన వారి అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నం, రాజమండ్రి, ఎన్టీఆర్, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో ప్రభుత్వం టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మన జిల్లాలో అడ్వాన్ స్పోక్‌మోడల్‌లో ఈ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఈహబ్ నిర్వహణ విషయంలో గ్రీన్ కోఎనర్జీ, ఓఎన్‌జీసీ, గెయిల్, అవంతి సంస్థలు ప్రమోటర్లుగా ఉంటాయన్నారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి, తద్వారా ఒక శక్తివంతమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి ఈ ఇన్నోవేషన్ హబ్ దోహద పడుతుందన్నారు. ప్రతిఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్ల పరిశీలన చేశామన్నారు. ఇదిలా ఉండగా కడియం మండలం వేమగిరి గతంలో మహానాడు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. హెలీపాడ్ ఏర్పాటుకు ఈ స్థలాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ కిషోర్, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు.

నేటి నుంచి మెగా డీఎస్సీ పరీక్షలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షలు జూన్ 6 నుంచి 30వ తేదీ వరకు మూడు సెషన్లలో జరుగుతాయని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. మెగా డీఎస్సీ పరీక్షల నిర్వహణపై గురువారం సాయంత్రం సమీక్షించారు. మెగా డీఎస్సీ పరీక్షలకు జిల్లాలో 3977 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. రాజమహేంద్రవరం లూథర్‌గిరిలోని అయోన్ డిజిటల్ కళాశాలలో ఈ నెల 6న 600 మందికి, 9న 600 మందికి, 12న 596 మందికి, 13న 960 మందికి, 23న 960 మందికి, 24న 301 మంది అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు.పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం విద్యుత్ ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఆటంకం లేకుండా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇబ్బంది లేకుండాచూడాలన్నారు.సమావేశంలో డీఈవో కే వాసుదేవరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కే తిలక్‌కుమార్, ఆర్టీసీ,డీఎం షబ్నం ఇతర సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగా చేస్తే ఆరోగ్యం : జేసీ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ ఉదయం యోగా చేస్తే ఆరోగ్యమని జేసీ ఎస్ చిన్నరాముడు అన్నారు. యోగా సాధన మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఆర్ట్స్ కళాశాల సమీపంలోని గ్రాండ్ ట్రంక్ రోడ్డులో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ప్రతి ఉదయం యోగాసాధన వల్ల శరీర రుగ్మతలు తొలగి ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు.ప్రజలందరూ స్వచ్ఛందంగా కుటుంబ సమేతంగా యోగ సాధన లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.విశాఖపట్నంలో ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో మన జిల్లా నుంచి శిక్షణ పొందిన ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, యోగాంధ్ర జిల్లా సమన్వయకర్త పి . కాజియా, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కెసిహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కడియపులంకలో యోగాంధ్ర

కడియం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కడియం నర్సరీలో పర్యాటక యోగాంధ్ర శనివారం జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో గురువారం పర్యాటక, ఇతర సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అఖండ గోదావరి ప్రాజెక్టు ఏర్పాటు చేసే క్రమంలో నిర్వహణ సామర్థ్యంపై సమాంతరంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లాలో నాలుగు పర్యాటక ప్రాంతాల్లో యోగాంధ్ర నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా శనివారం కడియపులంక పుల్లా చంటియ్య - సత్యదేవానర్సరీలో చేపడుతున్నట్టు తెలిపారు.సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, ఏపీఎంఐపీ పీడీ ఏ.దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.





పేదింటి బాట!

పేదింటి కలత తీర్చేలా ప్రభుత్వం అడుగులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

పేదల ఇంటి కల నెరవేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకెళుతోంది. ఈ నెల 12వ తేదీకి జిల్లాలో చాలా మంది పేదల సొంతింటి కల నెరవేర్చి గృహ ప్రవేశాలు చేయించాలనే మంచి ఆలోచనతో అధికారులకు లక్ష్యాలను నిర్దేశించింది.సీఎం చంద్రబాబు పేదల ఇళ్ల నిర్మాణ కల సాకారం చేయడానికి పూర్తి స్థాయిలో సన్నాహాలు చేస్తున్నారు. గత ప్రభుత్వ లేఅవుట్లలో మధ్యలోనే నిలిచిపోయిన పేదల ఇళ్లకు ఆర్థిక సాయం అందించి పూర్తి చేయడం, సొంత స్థలాలు ఉన్న వారికి ఇళ్లు నిర్మించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.అందులో భాగంగా ఈనెల 12న సామూహిక ఇళ్ల ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టారు. కోనసీమ జిల్లాలో 6,300 ఇళ్లు, కాకినాడ జిల్లాలో 6వేల వరకు ప్రారంభించనున్నారు. కోనసీమలో ద్రాక్షారామలోని వెలం పాలెం లేఅవుట్, కాకినాడలోని కరప మండలం వేలంగిలో సామూహిక ఇళ్లను ప్రారంభించనున్నారు. సొంత స్థలాలు ఉన్న వారు ఇళ్లు నిర్మించుకునేలా ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తుదారుల వివరాలను కేంద్రప్రభుత్వ హౌసింగ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి అనుమతులు ఇవ్వనున్నారు.

ఖాళీ స్థలాలపై సీఎం దృష్టి..

ప్రభుత్వం మారడంతో వీటిపై సీఎం చంద్రబాబు దృష్టిసారించారు. వేల కోట్లు వెచ్చించిన లే అవుట్ల పరిస్థితిపై కలెక్టర్ల ద్వారా నివేదిక సిద్ధం చేయిస్తున్నారు.ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని లే అవుట్లలో 1.70 లక్షల స్థలాలు ఖాళీగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో 1.06 లక్షల స్థలాలు పూర్తిగా ఖాళీగా ఉన్నాయని తేల్చారు. ఇందులో కొమరగిరి, కరప, రౌతులపూడి, తుని, కోటనందూరు, ఏలేశ్వరం,తాళ్లరేవు తదితర మండలాల్లో లేఅవుట్లు ఉన్నట్టు గుర్తించారు. కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో 64 వేల వరకు స్థలాలు ఖాళీగా ఉన్నట్టు గుర్తించారు. ఇందులో అసలే మాత్రం పనికిరానివి ఎన్ని? శ్మశానాల పక్కన ఉన్నవి ఎన్ని అనేది సైతం త్వరలో తేల్చబోతున్నారు.దీని ఆధారంగా పట్టాలు రద్దు చేస్తారు.

- 12న సామూహిక ఇళ్ల నిర్మాణాలు?
- ప్రారంభానికి అధికారుల సన్నాహాలు
- కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- గత ప్రభుత్వ నిర్వాకంపై నివేదిక
- 1.70 లక్షల ఇళ్ల స్థలాలు ఖాళీ
- ఉమ్మడి జిల్లాలోనే ఇదీ లెక్క
- రద్దు చేసే యోచనలో సర్కారు?

నాడు 3.84 లక్షల మంది ఎంపిక..

ఉమ్మడి జిల్లాలో సొంతిళ్లు లేని 3.84 లక్షల మందిని పథకానికి ఎంపిక చేశారు. తొలివిడత కింద ఉమ్మడి జిల్లాలో 1.53 లక్షల మందిని గుర్తించారు.ఈ మేరకు 7,218 ఎకరాలు అవసరం కాగా 1,856 ఎకరాల ప్రభుత్వ భూమి అందు బాటులో ఉన్నట్టు గుర్తించారు. దీంతో 5,362 ఎకరాల ప్రైవేటు భూములను ఇళ్ల స్థలాలకు సేకరించారు.ఇందుకు ఏకంగా రూ.2,566 కోట్లు ఖర్చు చేశారు.నాడు ఒక్కో అధికార పార్టీ ఎమ్మెల్యే అప్పట్లో కోట్లలో మెక్కేశారు. ఎకరం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు ముందే కొనుగోలు చేసి అవే భూములను తమ పలుకుబడితో రూ.42 లక్షల చొప్పున ప్రభుత్వానికి అంటగట్టి జేబులు నింపేసుకున్నారు. ఇలా సేకరించిన ఇళ్లస్థలాలు అసలు ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేవని అప్పట్లో లబ్ధిదారులు పెదవి విరిచినా పట్టించుకోలేదు.ఒక్క కాకినాడ జిల్లాలోనే 359 లేఅవుట్లలో 77,896 ఇళ్లు నిర్మించి తీరాల్సిందే నని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. తూర్పు గోదావరి జిల్లాలో 321 లేఅవుట్లలో 68 వేల ఇళ్లు కట్టించాలని భావించారు. లేఅవుట్లు ఏమాత్రం అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు అసలు కన్నెత్తి చూడలేదు.

నాడు జగన్ ఆరంభించినా..

నవరత్నాలు- పేదలందరికి ఇళ్లు పేరుతో అప్పటి జగన్ ప్రభుత్వం 2020 డిసెంబర్ 25న పథకం ప్రారంభించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లోని పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లిలోని కొమరగిరిలో అప్పటి సీఎం జగన్ ఈ పథకాన్ని ప్రారంభించారు. కాకినాడ నగరానికి చెందిన 16 వేల మంది లబ్ధిదారులకు పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలంలోని కొమరగిరిలో 250 ఎకరాలు కొనుగోలు చేశారు. ఇక్కడ సైతం ఇళ్ల నిర్మాణం పాతిక శాతం కూడా పూర్తికాలేదు.పైగా ఇక్కడ అప్పటి సీఎం జగన్ పథకాన్ని ప్రారంభించగా, పూర్తిగా విఫలమైంది. ఇలా ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లాలో అనేక లేఅవుట్లు ఇళ్ల నిర్మాణం జరగక దిష్టిబొమ్మల్లా మారాయి.

'తూర్పు'న లెక్క ఇలా..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలో 10,794 పేదల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా యంత్రాంగం పని చేస్తోంది.ఈ మేరకు కలెక్టర్ పి.ప్రశాంతి టార్గెట్ నిర్ణయించి ఆయా లేఅవుట్ల వారీ ప్రత్యేకాధికారులను నియమించి పనులు పరుగులు పెట్టిస్తున్నారు.ఇప్పటి వరకూ 5957 ఇళ్లు పూర్తయ్యాయి.ఇంకా 4837 ఇళ్ల నిర్మాణం పెండింగ్‌లో ఉంది.ఈ నెల 7వ తేదీకి మరో 2419 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు.ఇప్పటికి అందులో 62 పూర్తి చేశారు. ఇంకా జిల్లాలో 310 ఆర్‌సీ లెవల్, 1144 రూఫ్ లెవల్‌లో ఉన్నాయి.వాటిని ముందుగా పూర్తి చేసే ఆలోచన ఉంది. బేస్‌మెంట్ లెవల్‌లో 5714, లింటల్ లెవల్‌లో 2193 ఉన్నాయి.అవిప్పుడే పూర్తయ్యే అవకాశం లేదు. ఇళ్ల నిర్మాణ లక్ష్యాలతో ముందుకు వెళ్లే అధికారులకు కొన్ని ఇబ్బందులతో ఒత్తిడికి గురవుతున్నారు.

తూర్పున మండలాల వారీ ఇలా..

రాజమండ్రి అర్బన్‌కు చెందిన 3096 ఇళ్లను వెలుగుబందలో నిర్మించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 2327 పూర్తయ్యాయి. ఇది 75 శాతం.769 పెండింగ్‌లో ఉన్నాయి. అనపర్తిలో 685 లక్ష్యం కాగా 156 పూర్తయ్యాయి. ఇది 23 శాతం. బిక్కవోలులో 695 లక్ష్యంకాగా 197 పూర్తయ్యాయి.28 శాతం. కొవ్వూరులో 460కి 149 పూర్తి.ఇది 32 శాతం. సీతానగరంలో 269కి 88 పూర్తి ఇది 33శాతం. చాగల్లులో 385కి 132 పూర్తి ఇది 34 శాతం. కొవ్వూరు అర్బన్‌లో 595కి 209 పూర్తి ఇది 35శాతం . రాజమండ్రి రూరల్‌లో 295కి 105 పూర్తి ఇది 36 శాతం. ఉండ్రాజవరంలో 306కి 121 పూర్తి ఇది 40 శాతం. రంగంపేటలో 304కి 123 పూర్తి ఇది 40శాతం. నిడదవోలు అర్బన్‌లో 223కి108 పూర్తి. ఇది 48 శాతం. కడియంలో 219కి 108 పూర్తి ఇది 49శాతం. తాళ్లపూడిలో 284కి 151 పూర్తి ఇది 53 శాతం. పెరవలిలో 138కి 80 పూర్తి ఇది 58 శాతం. రాజానగరంలో 289కి 178 పూర్తి ఇది 62శాతం. కోరుకొండలో 266కి 165 పూర్తి ఇది 62శాతం. గోకవరంలో 211కి 131 పూర్తి ఇది 62 శాతం. నిడదవోలులో 388కి 212 పూర్తి ఇది 63శాతం. దేవరపల్లిలో 699కి 476 పూర్తి ఇది 68 శాతం. నల్లజర్లలో 563కి 399 పూర్తి ఇది 71 శాతం. గోపాలపురంలో 474కి 342 పూర్తి. ఇవి 72శాతం.



పురుషోత్తపల్లిలో ఏర్పాటు చేసిన బంక్



డీజిల్ మాఫియా!

- యథేచ్ఛగా డీజిల్ అక్రమ రవాణా
- బయోడీజిల్ పేరుతో బంక్ ఏర్పాటు
- యానాం తదితర ప్రాంతాల నుంచి దిగుమతి
- ప్రత్యేకంగా హెచ్‌పీ స్టిక్కర్ ఒక ట్యాంకర్
- బయట లీటర్ రూ.96.. ఇక్కడ రూ.75
- పురుషోత్తపల్లి కేంద్రంగా సాగుతున్న దందా

ఇప్పటి వరకూ ఇసుక మాఫియా చూశాం.. మట్టి మాఫియా.. డీజిల్ మాఫియా ఎక్కడైనా చూశారా.. చూడలేదంటారా.. అయితే ఇప్పుడు చూసేయవచ్చు. ఒకసారి నిడదవోలు మండలం పురుషోత్తపల్లి వెళితే అక్కడ ఏకంగా ఒక బంక్‌నే ఏర్పాటు చేసేశారు.. యథేచ్ఛగా బయోడీజిల్ పేరుతో డీజిల్ విక్రయిస్తూ దందాకు తెరలేపారు.. అది కూడా హెచ్‌పీ స్టిక్కర్‌తో ఉన్న ట్యాంకర్‌ను ఒక బొలెరో వాహనాన్ని ఏర్పాటు చేసుకుని ఎక్కడికి కావాలంటే అక్కడికి డీజిల్ తరలిస్తూ దందా సాగిస్తున్నారు. సాధారణంగా ఏ బంక్‌లో చూసిన లీటర్ డీజిల్ రూ. 96ల వరకూ ఉంది. . ఈ బంక్ నుంచి డోర్ డెలివరీ చేసినా రూ.75లు మాత్రమే. అలా ఎలా అంటారా.. ఒకసారి దందా ఎలా సాగిస్తున్నారో మీరే తెలుసుకోండి మరి..

నిడదవోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆ దారిలో వెళ్లే వాహనాలు చాలా తక్కువ.. అయితే ఆ దారిలో మాత్రం ఒక బంక్ ఉంటుంది.. చూసిన వారెవరికైనా ఇక్కడ బంక్ ఎందుకు అనే అనుమానం రాక మానదు.. ఎందుకంటే డీజిల్ బంక్ అనే బోర్డు తప్ప ఇంకేం ఉండదు. దీనిపై అనుమానం వచ్చిన 'ఆంధ్రజ్యోతి' ఆరా తీస్తే అసలు దందా బయటపడింది. మట్టి, ఇసుకను మించి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతూ డీజిల్ మాఫియా చెలరేగిపోతుందనే విషయం బయటపడింది. పేరుకు మాత్రమే బయో డీజిల్ బంక్ ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుంచి డీజిల్‌తో పాటుగా బయోడీజిల్ పేరుతో క్రూడాయిల్‌ను దిగుమతి చేసుకుని డీజిల్ మాఫియాకు తెరలేపుతున్నారు. ప్రముఖ కార్పొరేట్ కంపెనీ హెచ్.పీ పేరుతో ఏకంగా ట్యాంకర్ ఉన్న వాహనాన్ని తయారు చేయించి అడిగిన చోటుకు నేరుగా వచ్చి అన్‌లోడ్ చేసి వెళ్లిపోతున్నారు.పగలు రాత్రి తేడా లేకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టి డీజిల్ దందా నడుపుతున్నా ప్రభుత్వ అధికారుల మౌనంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బయోడీజిల్ పేరు ఎక్కడ?

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం గోపవరం నుంచి డి.ముప్పవరం వెళ్లే దారిలో పురుషోత్తపల్లి సమీపంలో బయో డీజిల్ బంక్ ఏర్పాటైంది.మాఫియా ఈ బంక్‌ను అడ్డాగా చేసుకుని డీజిల్ బంక్ అంటూ బోర్డు పెట్టేసింది. తెలంగాణ, మహారాష్ట్ర నుంచి పరిశ్రమల క్రూడాయిల్‌ను తెప్పిస్తూ దీంతో పాటుగా అప్పుడప్పుడు బయోడీజిల్ దిగుమతి చేసుకుంటున్నారు.ఆ తరువాత లారీ యజమానులను బయోడీజిల్ అంటూ బురిడీ కొట్టిస్తున్నారు.కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి దొడ్డి దారిన బిల్లులు లేకుండా తక్కువ ధరకు డీజిల్ తెప్పిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.ఈ డీజిల్‌ను ఇసుక ర్యాంపుల వద్ద ఇసుక లారీలకు ప్రత్యేకంగా హెచ్‌పీ స్టిక్కర్‌తో తయారు చేయించిన వాహనం ద్వారా అనధికారికంగా సరఫరా చేస్తున్నారు.

డీజిల్ లీటర్ రూ.75

ఈ డీజిల్ దందా కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి వచ్చే అనధికార డీజిల్‌తో పాటుగా బయో డీజిల్ అంటూ ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న రెండో రకం క్రూడాయిల్‌ను యథేచ్ఛగా విక్రయించేస్తున్నారు. దీనిపై కూపీ లాగగా ఆ బంక్ పేరుతో ఒక ట్యాంకర్ బయో డీజిల్ బిల్లుతో వస్తే మరో ఆరు ట్యాంకర్ల క్రూడాయిల్ అనధికారికంగా వస్తుందని అలాగే యానాం నుంచి డీజిల్ ఎటువంటి బిల్లులు లేకుండా లారీలకు లారీలు దొడ్డిదారిన ఇక్కడకు వస్తున్న విషయం బట్టబయలైంది. పురుషోత్తపల్లి బంకు నుంచి యథేచ్ఛగా డీజిల్ దందా సాగుతున్నా అధికారుల మౌనం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.పెట్రోల్ బంకుల్లో సుమారు రూ.96లకు లీటర్ డీజిల్ ధర ఉండగా అడిగిన చోటుకే వచ్చి సుమారు రూ.75లకే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే డీజిల్, బయోడీజిల్, డీజిల్ పేరుతో క్రూడ్ అయిల్ సరఫరా చేస్తున్నారు.ఇసుక లారీ యజమానులు ఇవి తక్కువ ధరకు రావడం తమకు కావలసిన చోటుకు వచ్చి అందించడంతో ఈ డీజిల్ మాఫియాకు పూర్తిగా సహకరిస్తున్నారు.ఈ డీజిల్ మాఫియాపై అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందనలేదని ప్రముఖ కార్పొరేట్ కంపెనీ డీజిల్ డీలర్ ఆవేదన వ్యక్తం చేశారు.

హెచ్.పి.కంపెనీ పేరుతో వాహనం



డీజిల్ మాఫియాకు సుమారు 3 వేల లీటర్లు కలిగిన ట్యాంకర్‌తో బొలేరో వాహనాన్ని సిద్ధం చేశారు.ఆ ట్యాంకర్ వెనుక భాగంలో డీజిల్ కొట్టేందుకు గన్, డిజిటల్ ఎక్విప్‌మెంటు ఏర్పాటు చేసింది. దీనిపై ఎవరికి అనుమానం రాకుండా.. అనుమతులు లేకుండానే హెచ్‌పి (హిందుస్థాన్ పెట్రోలియం) కంపెనీ లోగోను పెయింట్ వేయించేసింది.ఈ వాహనం ముందు నుంచి చూస్తే బొలేరో వాహనంలా కనిపిస్తుంది. వెనుక చూసే వారికి మాత్రమే ట్యాంకర్ లా కనిపిస్తుంది. ఈ వాహనానికి ఎటువంటి అనుమతులు లేకుండానే లారీ స్టాండులో ఉన్న లారీలకు, జిల్లాలోని ఇసుక ర్యాంపుల్లో ఉండే లారీలకు నేరుగా పోయి డీజిల్ సరఫరా చేస్తు న్నారు. చూసేవారికి హెచ్.పి కంపెనీకి చెందిన ఆయిల్ ట్యాంకర్‌లా నమ్మిస్తూ ఇలా అనధికారికంగా యథేచ్ఛగా డీజిల్ దందా సాగిస్తోంది.

ఆటలోనే.. చిన్నారి ఊపిరి ఆగింది!

మరో చిన్నారికి గాయాలు



ధవళేశ్వరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు కావడంతో ఆ చుట్టుపక్కల చిన్నారులంతా చేరి చెట్టునీడన ఆటలాడుకుంటున్నారు. ఆ చెట్టే ఓ చిన్నారి పాలిట మృత్యువు అవుతుందని ఎవరూ ఊహించలేకపోయారు. గురువారం ఉదయం పది గంటల సమయంలో ధవళేశ్వరంలోని బస్టాండ్ వెనుక వీధిలో ఉన్న రావిశెట్టి నీడలో పాతూరి అక్షర (9), దావదాసి లిషితతో పాటు మరికొందరు పిల్లలు ఆటలాడుకుంటున్నారు. అదే సమయంలో రావిచెట్టు నుంచి భారీ కొమ్మ ఒక్కసారిగా విరిగిపడి... పక్కనే ఉన్న కరెంట్ స్తంభంపై పడి, ఆపై చిన్నారులు అక్షర, లిషితపై పడడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. దీన్ని చూసిన స్థానికులు, బంధువులు హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో అక్షర మృతి చెందగా, లిషిత ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి విరిగిపోయిన కరెంట్ స్తంభం, తెగిపోయిన వైర్లను తొలగించారు. అయితే ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ గణేష్ తెలిపారు. చిన్నారి మృతితో కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్న తండ్రి త్రిమూర్తులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. దీంతో ఆ పేటలో విషాదఛాయలు అలముకున్నాయి.చిన్నారి మృతితో కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్న తండ్రి త్రిమూర్తులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.దీంతో ఆ పేటలో విషాదఛాయలు అలముకున్నాయి.ఆ చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.తల్లిదండ్రులను ఆపడం ఎవరి వల్లా కాలేదు.

పాపులేషన్ పాలసీపై ప్రభుత్వం కసరత్తు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జనాభా నిర్వహణ విధానానికి సంబంధించిన గోడ పత్రికను గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. జనాభా సమతుల్యత సాధించే దిశలో జూన్ 20లోగా జనాభా నిర్వహణ విధానంపై ఆలోచనలు పంచుకోవాలన్నారు.జనాభా నిర్వహణ విధాన రూపకల్పనలో జిల్లాలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు ముఖ్య ప్రణాళిక శాఖ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తున్నట్టు తెలిపారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



పట్టణంలోని సత్యవతినగర్ బైపాస్‌లో మొక్కలు నాటుతున్న ఆర్డీవో రాణీసుస్మిత, పక్కన మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి, కమిషనర్ నాగేంద్రకుమార్

పర్యావరణాన్ని కాపాడాలి

● ఆర్డీవో రాణీసుస్మిత ● ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



గోపాలపురం ఏఎంసీలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి, తదితరులు

కొవ్వూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడాలని ఆర్డీవో రాణీసుస్మిత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక సత్యవతినగర్ బైపాస్ రోడ్డులో మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఆర్డీవో రాణీసుస్మిత, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొన్ని మొక్కలునాటారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం దైనందిన జీవితంలో ఒక భాగమైపోయిందని, దీనివల్ల పర్యావరణం దెబ్బతిని ప్రజలకు హాని కలుగుతోందన్నారు. చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని దత్తత తీసుకుని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించవచ్చునన్నారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. కమిషనర్ టి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో ప్లాస్టిక్ గ్లాసులు, బాటిల్స్ వినియోగాన్ని నిషేధించామని, అదేవిధంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పిల్లలమర్రి మురళీకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, అవంతి ఫ్యాక్టరీ ఉద్యోగులు, టౌన్‌ప్లానింగ్ అధికారి టి. మణిరామ్, ఏఈ సుమంత్, ఆర్ఐ శ్యామ్, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు ఆధ్వర్యంలో కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎంపీడీవో టీబీవీ రమణ, సూపరింటెండెంటు వీవీఎస్ చౌదరి, జడ్పీటీసీ బి. వెంకటలక్ష్మి, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాసుగర్స్‌లో: ఆంధ్రాసుగర్స్ ఫ్యాక్టరీ మేనేజర్ ఈవీ కృష్ణారావు ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఫ్యాక్టరీ ఉద్యో గులు పర్యావరణాన్ని కాపాడాలని ఫ్లకార్డులు ధరించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గోదావరి తీరం వెంబడి రోడ్డు పక్కన మొక్కలు నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పర్సనల్ మేనేజర్ సీహెచ్ఎస్ మహర్షి, జె. రఘు, జి.త్రినాథ్, కె. హరనాథ్ గోపాల్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో ...

జిల్లా న్యాయ సేవా సంస్థల ఆదేశాల మేరకు కోర్టు ప్రాంగణంలో మండల లీగల్ సెల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి. సాయికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వర్రే నాగ మురళీకృష్ణ హాజరై కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపిపి కె. గోపాలకృష్ణ, న్యాయవాదులు వై. చలపతి, వై. ప్రకాష్, శ్రీవల్లీ, టి. ప్రభాకరరావు, ఎం. శ్రీనివాస్, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.

నిడదవోలు: ప్రపంచ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఆర్టీసీ డిపో మేనేజర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. అలాగే ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, తిమ్మరాజుపాలెంలోని కోట సత్తెమ్మ దేవస్థానంలో సహాయ కమిషనర్ బీ. హరిసూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, సిబ్బంది, తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.

గోపాలపురం: పర్యావరణ పరిరక్షణకు పల్లెలు సైతం ఉద్యమించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. సీఎం చంద్రబాబు పిలుపు మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గోపాలపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వనం - మనం కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు, ఉపాధి హామీ సిబ్బందితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, డైరెక్టర్ కూనపం ప్రసాద్‌బాబు, పట్టణ అధ్యక్షుడు జ్యేష్ట శ్రీధర్, సీనియర్ నాయకులు కొర్లపాటి రాము, పడమటి శ్రీనివాస్, ఏపీవో జేవీ రమణ, డ్వాక్రా మహిళలు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు భాగస్వాములయ్యారు.

తాళ్లపూడి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలుగ్రామాల్లో గురువారం మొక్కలు నాటారు. పెద్దేవంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉపసర్పంచ్ తోట రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే తాళ్లపూడి పంచాయతీ కార్యాలయం వద్ద ఉప సర్పంచ్ అప్పన జగదీష్, మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సీఏలు పాల్గొన్నారు. వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొక్కలు నాటితేనే మానవుడి మనుగడ మెరుగ్గా ఉంటుందని ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు అన్నారు. అలాగే తహశీల్దార్, ఎంపీడీవో, ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయాల్లో అధికారుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, రమాదేవి, పలు కార్యాలయాల సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. పెరవలిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమా రాజ్యలక్ష్మి పద్మజ, తహశీల్దార్ అచ్యుతకుమారి, సర్పంచ్ గంగోలు సీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: ఆరోగ్యవంతమైన సమాజం కోసం పర్యావరణాన్ని కాపాడటం మనఅందరి బాధ్యత అని ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి అన్నారు. గురువారం చాగల్లు మహిళ సమాఖ్య భవనం ఎదురుగా ఆయన చేతులమీదుగా మొక్కలు నాటారు. నాదెళ్ల అశ్విని, మహిళ సమాఖ్య కార్యదర్శి డొక్కు లక్ష్మీపార్వతి, డ్వాక్రా క్లస్టర్ కోఆర్డినేటర్ సాయిలక్ష్మి, పోశమ్మ, యానిమేటర్లు సరిత, కాంచన, ప్రభవతి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక పంచాయతీ కార్యాలయం, నెలటూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఆయా పంచాయతీల కార్యదర్శుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యదర్శులు మొహ్మద్ ఆలీ, నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా గురువారం మొక్కలు నాటారు. మొత్తం 15 గ్రామాలకు 2005 మొక్కలు అందజేశారు. పంచాయతీ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గ్రామసర్పంచ్, టీడీపీ నేత గన్నమని హరికృష్ణ మొక్కలు నాటారు. అలాగే సొసైటీ కార్యాలయం వద్ద సొసైటీ కార్యదర్శి కల్లూరి శ్రీనివాస్ శర్మ, కృష్ణంపాలెంలో సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పరమేశ్వర బయోటెక్ మొక్కజొన్న పరిశ్రమ జీఎం శివప్రసాద్ తమ పరిశ్రమ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాజారావు, ఏపీవో శ్రీనివాస్, టీడీపీ నేతలు హరికృష్ణ, ఉప్పులూరి రాంబాబు, పెనుమత్స సుబ్బరాజు, కార్యదర్శి ఎస్.రవికిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీడీవో వీఎస్ రామారావు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పాలంగిలో ఎస్‌డబ్ల్యూఎం షెడ్డు వద్ద ఆయన మొక్కలు నాటి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పర్యావరణ సమతుల్యతను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, ఈవోపీఆర్డీ కె. ఆంజనేయశర్మ, ఏఈలు భవాని, ఏడుకొండలు, ఉపాధి హామీ పథకం టీఏ కాంతారావు, పంచాయతీ కార్యదర్శి ఎమ్‌డీ హసన్‌జాని, నాయకులు, ఉపాధి కూలీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నిడదవోలు: ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటుతున్న డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు



తాళ్లపూడిలో మొక్కలు పంపిణీ చేస్తున్న ఉప సర్పంచ్ జగదీష్, తదితరులు



పెరవలిలో మొక్కలు నాటుతున్న దృశ్యం



దేవరపల్లిలో మొక్కలు నాటుతున్న సర్పంచ్, టీడీపీ నాయకులు

కాలనీ దగ్గరలోనే సప్లిమెంటరీ రేషన్ పాయింట్

● స్పందించిన ఆర్డీవో రాణీసుస్మిత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాళ్లపూడి, జూన్ 5 (తాళ్లపూడి): రేషన్ సరుకులు కాలనీ దగ్గరలోనే ఇవ్వాలని గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన శీర్షికకు ఆర్డీ వో రాణీసుస్మిత స్పందించారు. అన్నదేవరపేట పంచాయతీ పరిధిలోని సూరయ్యపేటలో ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో పలు గ్రామాల పేదలు ఇళ్లు కట్టుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అక్కడి ప్రజలకు రేషన్ తీసుకోవడానికి ఖర్చుతో కూడుకున్న సమస్యపై ఆర్డీవో స్పందించారు. ఈ విషయమై తాళ్లపూడి రేషన్ షాపుల్లో వృద్ధులకు రేషన్ పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించేందుకు ఆమె మాట్లాడుతూ ఇక్కడి ప్రజలకు కాలనీ వద్దే సప్లిమెంటరీ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి రేషన్ పంపిణీ చేస్తామని తెలిపారు.

గోదావరి నదిలో జలచరాలకు మరమరాలు



మరమరాలను ఆహారంగా వదులుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్

కొవ్వూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో జలచరాలకు మరమరాలను ఆహారంగా వేశారు. గురువారం సాయంత్రం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీ శివప్రసాద్, గోవు, గోదావరి ప్రేమికులు సంయుక్తంగా పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా స్నానమాచరించడానికి వచ్చిన చిన్నారులతో జలచరాలకు మరమరాలు ఆహారంగా నదిలో వదిలారు. కార్యక్రమంలో వినయ్, సింహాద్రి తులసీరావ్, గోవు, గోదావరి ప్రేమికులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



రాక్షసి పుల్లమ్మ (ఫైల్)

నల్లజర్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పోతవరం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు రాక్షసి పుల్లమ్మ (110) గురువారం అనారోగ్యంతో మృతి చెందినట్టు వారి బంధువులు తెలిపారు. ఈమెకు ఇద్దరు కుమారులు లక్ష్మీ పతిరాజు, ఆంజనేయరాజు, కుమార్తెలు పాపయమ్మ, కస్తూరి ఉన్నారు. వీరిపిల్లల మొత్తం 35 మంది వరకు ఉన్నారు. ఐదుతరాల ముదిమనవళ్లను పుల్లమ్మ చూసింది. మరణించేంత వరకు కూడా తన పనులు తాను చేసుకునేదని కుటుంబసభ్యులు తెలిపారు. ఆమె అంత్యక్రియలు పోతవరంలో నిర్వహించారు.శతాధిక వృద్ధురాలు కావడంతో చూసేందుకు జనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

'మానవుని అనంతమైన మేధాశక్తి, ఆత్మశక్తుల కలయికే యోగా'



యోగాసనాలు వేస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి సత్యనారాయణమూర్తి

కొవ్వూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):మానవుని అనంతమైన మేధాశక్తి, ఆత్మశక్తుల కలయికే యోగా అని జిల్లా ప్రజా రవాణాధికారి వై. సత్యనారాయణమూర్తి అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మేనేజర్ వైవీవీఎన్ కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా రవాణాధికారి వై. సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ముందుగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బస్టాండ్ ప్రాంగణంలో 20 మొక్కలు నాటారు. డిపో మేనేజర్ కుమార్ మాట్లాడుతూ యోగా 5000 సంవత్సరాల నుంచి భారతదేశంలో అంతర్భాగమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాల్టీ ఆధ్వర్యంలో...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం ప్రాంగణంలోని సంస్కృత కళాశాలలో గురువారం నిర్వహించారు. స్కూల్ అసిసెంట్(ఫిజికల్ డైరెక్టర్) కె. సౌజన్య అవగాహనా సదస్సులో పాల్గొన్న వారికి యోగాపై అవగాహన కల్పించి, యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఎంఈవో రామకిషోర్, ఎం. రజాసులోచన, హెల్త్‌సూపర్‌వైజర్, ఆశ, ఏఎన్ఎంలు, వార్డు సెక్రటరీలు, హెల్త్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'గ్రంథాలయాలు ... ఆధునిక దేవాలయాలు'

దేవరపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని యర్నగూడెం గ్రామసర్పంచ్ బొంతా భరత్‌బాబు అన్నారు. మండలంలోని యర్నగూడెం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం గురువారం ముగింపు సందర్భంగా గ్రామసర్పంచ్ బొంతా భరత్‌బాబు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బొల్లిన విజయభాస్కర్ పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవివిజ్ఞాన శిబిరం విద్యార్థుల్లో మరింత సృజనాత్మకత పెంపొందించడానికి సదస్సులు ఎంతో దోహదపడతాయని అన్నారు. గ్రంథాలయ పాఠకుల సౌకర్యార్థం 30 కుర్చీలను సర్పంచ్ భరత్‌బాబు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, కార్యదర్శి అమ్మిరాజు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అనిత, వ్యాయామ ఉపాధ్యాయులు మరపట్ల మురళీ, ఫిషర్‌మ్యాన్ సొసైటీ అధ్యక్షుడు అయ్యన్న, తదితరులు పాల్గొన్నారు.

200 కార్లలో విజయవాడకు తరలిన తెలుగు తమ్ముళ్లు



క్రేన్ ద్వారా శేషారావుకు గజమాల వేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నిడదవోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు గురువారం విజయవాడలో స్కిల్‌డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వేలివెన్ను నుంచి విజయవాడకు టీడీపీ నేతలు, కార్యకర్తలు సుమారు 200 కార్లతో ర్యాలీగా తరలి వెళ్లారు. కోట సత్తెమ్మ గుడి సమీపానికి వచ్చేసరికి పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు వెలగన సూర్యారావు ఆధ్వ ర్యంలో భారీ గజమాలను క్రేన్ ద్వారా శేషారావు మెడలో వేసి స్వాగతం పలికారు.

పెరవలి: రాష్ట్ర స్కిల్ డెలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బూరుగుపల్లి శేషారావు గురువారం అధికారంగా విజయవాడలో పదవీ బాధ్యతలు చేపట్టారు. దీంతో మండలంలోని ఆయా గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

ఉండ్రాజవరం: ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ చైర్మన్‌గా పదవీ బాధ్యతులు స్వీకరించేందుకు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు గురువారం ఉదయం విజయవాడ వెళ్లారు. నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణం, ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలురూరల్ మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఉదయం వేలివెన్ను నుంచి వాహనాలు, కార్లుతో భారీ ర్యాలీగా బయలు దేరి వెళ్లారు. నియోజకవర్గం నుంచి పలువురు ముఖ్య నాయకులు వెళ్లారు.

సెల్‌ఫోన్ దొంగిలించిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగలగొట్టి సెల్‌ఫోన్ దొంగిలించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. పట్టణంలోని యువరాజ్ కేబుల్ ఆఫీసు వీధికి చెందిన గవర దుర్గాసాయి గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో ఇంటికి తాళం పెట్టి గోష్పాదక్షేత్రంలో గోదావరి స్నానానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటిలో చార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

'పాఠశాల విలీనాన్ని నిలుపుదల చేయాలి'



ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దొమ్మేరు ఇందిరమ్మ కాలనీ వాసులు

కొవ్వూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖాధికారులు తమను మోసం చేసి ప్రాథమిక పాఠశాలను మూసివేసే ప్రయత్నాలు చేస్తున్నారని దొమ్మేరు ఇందిరమ్మకాలనీ వాసులు ఆందోళన బాట పట్టారు. ఎస్సీ ఏరియాలోని మొట్టమొదటి పాఠశాలైన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తరలించొద్దని గురువారం ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈవో 1 బి. స్వరూప్‌కి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎంఈవో స్వరూప్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు మేము పనిచేస్తున్నామని, మీరంతా విద్యాశాఖ కమిషనర్ దగ్గర నుంచి ఆర్డర్ తెచ్చుకోవాలని సూచించారు. దీనిపై గ్రామస్థులు, తల్లితండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనిమెల్లి జ్ఞానేంద్ర మాట్లాడుతూ కాలనీలో ఉన్న స్పెషల్ ఎంపీపీ పాఠశాలను తరలించవద్దని ఎస్ఎంసీ కమిటీ తీర్మానం చేసి విద్యాశాఖాధికారులకు అందజేశామన్నారు. గ్రామ సర్పంచ్ తానేటి కుమారి, ముదునూరి నాగరాజు, పాఠశాల ఎస్ఎంసీ కమిటీ సభ్యులు రౌతురాణి, పోసిపో బేబి, ఎం. లక్ష్మి, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

గోరక్ష చట్టాన్ని అమలు చేయాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నరసింహప్రసాద్

దేవరపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గోహత్య నిషేదచట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ గోరక్ష ప్రముఖ్ నరసింహప్రసాద్ పేర్కొన్నారు. గురువారం గోరక్ష చట్టాన్ని అమలు చేయాలని వివిధ డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు ఆర్టికల్ 48 నిబంధన గోరక్ష కోసమే ఏర్పాటు చేసినవని. అయినప్పటికి రాష్ట్రంలో విచ్చలవిడిగా గోవధ జరుగుతుందన్నారు. రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గోవధశాలలను తక్షణం మూసివేయాలన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో గోశాలలు ఏర్పాటు చేయడంతో పాటు గుర్తింపుపొందిన గోశాలలకు నిధులు కేటాయించాలన్నారు. ముఖ్యంగా బక్రీద్ సందర్భంగా గోవధ మరీ రెట్టింపు సాయం జరుగుతుందని చట్టం అమలు చేయాల్సిన యంత్రాంగం చూసీ చూడనట్టు వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో వేగివాడ వెంకటసుబ్రహ్మణ్యం, పిల్లి వెంకటేశ్వరరావు, సీహెచ్ ఉదయ్‌కుమార్, తోట మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోచవరంలో జలజీవన్ మిషన్ కేంద్ర బృందం పర్యటన



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

తాళ్లపూడి, జూన్5 (ఆంధ్రజ్యోతి): పోచవరం పంచాయతీలో జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనులు పరిశీలిం చేందుకు జలజీవన్ మిషన్ కేంద్ర బృందం సభ్యులు కె. ప్రకాష్, జె. శ్రీమన్నారాయణ, ఏ. ప్రవీణ్ గురువారం పర్యటించారు. గ్రామాల్లో ఉండే నీటి గురించి శానిటేషన్ కమిటీతో కలిసి పలు విషయాలపై చర్చించారు. వీరికి సర్పంచ్ కాకర్ల హేమలత దంపతులు, కార్యదర్శి రామలక్ష్మి స్వాగతం పలికారు. అనంతరం గ్రామానికి కేటాయించిన పనుల వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బీవీ గిరి, ఏఈ సూర్జహాన్‌ను అడిగి తెలుసుకున్నారు. స్థానిక నేత అనపర్తి ప్రసాద్ గ్రామంలో తాగునీటి అవసరాలను, పైపులైన్‌పై చేపట్టాల్సిన పనుల గురించి కేంద్ర బృందానికి తెలిపారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పంచాయతీ ఆవరణలో కేంద్ర బృందం సభ్యులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

దుర్భాషలాడుతూ... చెల్లిని కొట్టిన అన్నపై కేసు

కొవ్వూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : తన వాటా ఇంట్లోకి వెళ్లనివ్వకుండా అడ్డగించి చెల్లెలిని, ఆమె కుమార్తెను కొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. కొవ్వూరు పట్టణానికి చెందిన జంగం రమాదేవికి పోలిమాటి భీమరాజు, రాంబాబు అనే ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. వీరి తల్లి తండ్రులకు క్రిస్టియన్‌పేటలో రెండువాటాల ఇళ్లు ఉంది. ఆ ఇంటిలో చనిపోయిన భీమరాజు తన వాటాను అక్క రమాదేవికి రాసి ఇచ్చాడు. గురువారం తన వాటా ఇంటిలోకి వెళ్లిన రమాదేవిని, ఆమె కుమార్తెను అన్న పోలిమాటి రాంబాబు ఈ ఇంటితో నీకు సంబంధం లేదంటూ దుర్భాషలాడుతూ కొట్టాడు. దీనిపై రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ ప్రకాష్ తెలిపారు.


రాష్ట్ర మహాసభకు ఏపీజీఈఏ ఉద్యోగులు



విజయవాడకు వెళ్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

కొవ్వూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర మహాసభలకు కొవ్వూరు నుంచి రెండు బస్సుల్లో ఉద్యోగ సంఘాల నాయకులు తరలివెళ్లారు. గురువారం ఉదయం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద సభకు వెళ్తున్న వాహనాలకు ఏపీజీఈఏ కొవ్వూరు తాలూకా యూనిట్ ప్రెసిడెంట్, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సభలో ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న 14 రకాల డిమాండ్లపై తీర్మానాలు చేసి ప్రభుత్వానికి అందించాలని ఉద్యోగులు నిర్ణయించారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. కమల్‌సుందర్, వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన అన్నితరగతుల ఉద్యోగులు పాల్గొన్నారు.

'మండలాన్ని అభివృద్ధి చేసేందుకు సహకరించాలి'



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీపీ నారాయుడు

కొవ్వూరు, జూన్5 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్లడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ కాకర్ల నారాయుడు అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.కోటి 33 లక్షలతో దొమ్మేరు, ఆరికిరేవుల, వేములూరు, నందమూరు, కుమారదేవం, వాడపల్లి, మద్దూరు, పంగిడి లో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇంకా గ్రామాల్లో సమస్యలు ఉన్నట్ట యితే సమావేశం దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం 15వ ఆర్థికసంఘం నిధులతో చేపట్టే పనులకు సమావేశం ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో ఎంపీడీవో టీబీవీ రమణ, జడ్పీటీసీ బీ. వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి వీరమళ్ల నారాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెరవలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కానూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి నడిపల్లి ఇండస్ట్రియల్ ఫీడర్ ట్రీ కటింగ్ పనుల నిమిత్తం ఈ నెల 6వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ అప్పారావు తెలిపారు. కానూరు, నడిపల్లిలోని కోళ్లఫారాలు, ఆక్వా రైతులు, ఇతర పారిశ్రామిక వేత్తలు, వినియోగదారులు సహకరించాలని కోరారు.